నేటి కందం- నేటికి అందం

వరవంగ సంస్కృతిని-ఆ
దరణీయము జేయ దలచి తనదగు శైలిన్
స్మరణీయమ్ముగ టాగోర్
పరహితుడై పుష్యమేళ ప్రారంభించెన్ !!

(3-1-1894 టాగోర్ పుష్యమేళ ప్రారంభించిన రోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

మణిపూర్ మంటలకు
ముఖ్యమంత్రి క్షమాపణ
చెప్పినంత మాత్రానా
చెదురుతుందా ఆరోపణ
జనాన్నంతా సమానంగా
చూస్తే కదా ప్రభుత్వం
చిగురించును రాష్ట్రమంత
చిర శాంతికి జవసత్వం

-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 3-1-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:114 పేజీలు:6 వెల: రూ.1/-

సాగు భూమికే భరోసా..14 నుంచి రైతుల ఖాతాలలో నిధులు జమ

హైదరాబాద్, జనవరి 2: నూతన సంవత్సరం వేళ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి శుభవార్త చెప్పింది. పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందిచ్చే రైతు భరోసా నిధులను 2025, జనవరి 14వ తేదీ నుండి రైతుల ఖాతాల్లో జమ చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. రైతు భరోసా స్కీమ్ గైడ్ లైన్స్ రూపకల్పన కోసం ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ గురువారం సచివాలయంలో భేటీ అయ్యింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి, కోమటిరెడ్డి సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రైతు భరోసా విధివిధానాల రూపకల్పనపై మంత్రి వర్గ ఉప సంఘం సుదీర్ఘంగా చర్చించారు.

సాగు భూమికే భరోసా నిధులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ మాదిరిగా కాకుండా కేవలం సాగు చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇంప్లిమెంట్ చేయాలని కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయపడింది.. అలాగే రైతు భరోసా పథకం కోసం దరఖాస్తులు స్వీకరించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు రెండు రోజుల పాటు రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించి.. వాటిని పరిశీలించిన అనంతరం విధివిధానాలు ఖరారు చేయనున్నారు.

శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా రాష్ట్రంలోని సాగు భూములు గుర్తించి కేవలం సాగుదారులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని సబ్ కమిటీ భేటీలో చర్చ జరిగింది. అలాగే ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని ఇందులో ఎలాంటి కోత పెట్టొదని మంత్రి వర్గం ఉప సంఘం సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

ధరణి పోర్టల్ ప్రకారం రాష్ట్రంలో ఒక కోటీ 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక కోటీ 53 లక్షల ఎకరాలకు రైతు బంధు ఇచ్చింది. గుట్టలు, వెంచర్లు, సాగు చేయని భూములకు కూడా గత ప్రభుత్వం రైతు బంధు ఇచ్చి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని.. ఇప్పుడు అలా కాకుండా కేవలం సాగు చేసే భూములకు రైతు భరోసా నిధులు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది.

ధరణి పోర్టల్ రికార్డుల ప్రకారం.. ఒక కోటీ 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఇందులో సాగు చేసే భూమి కోటీ 30 లక్షలు ఎకరాలుగా ప్రభుత్వం గుర్తించింది. కేవలం ఈ భూములకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నది.. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం నాడు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సబ్ నివేదిక అందజేస్తారు.. ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు ఈ పథకం విధివిధానాలు ఖరారు చేసి అర్హులైన రైతులకు ఈ నెల 14 నుంచి వారి ఖాతాలలో నిధులు జమ చేయనుంది ప్రభుత్వం.

దీప్తి జీవన్‌జీకి అర్జున అవార్డు.. అభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 2:పారాలింపిక్స్‌లో భారత్‌కు కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ క్రీడాకారిణి, వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ దీప్తి జీవన్‌జీ ప్రతిష్ఠాత్మక క్రీడా పురస్కారం అర్జున అవార్డు 2024 కు ఎంపికైనందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణ యువ క్రీడాకారులు మరింత రాణించాలని, అందుకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, క్రీడా సముదాయాలు దోహదపడతాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

అలాగే క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఏపీ నుంచి అర్జున అవార్డుకు ఎంపికైన జ్యోతి యర్రాజీకి (అథ్లెటిక్స్)?. ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఎంపికైన గుకేశ్ (చెస్), హర్మన్ ప్రీత్ సింగ్ (హాకీ), ??ప్రవీణ్ కుమార్ (పారా అథ్లెటిక్స్), మను బాకర్ (షూటింగ్)లను సీఎం రేవంత్ అభినందించారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి 2024లో అర్జున, ద్రోణాచార్య అవార్డులకు ఎంపికైన క్రీడాకారులు, కోచ్‌లను ముఖ్యమంత్రి అభినందించారు.

తెలుగు తేజాలకు అర్జున అవార్డు..

కేంద్ర ప్రభుత్వం 2024 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా అవార్డులను ప్రకటించింది. ఇందులో ఏపీ, తెలంగాణ నుంచి ఇద్దరు అర్జున అవార్డులకు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్‌లో జ్యోతి యర్రాజీ, పారా అథ్లెటిక్స్‌లో జీవన్‌జీ దీప్తి అర్జున అవార్డులకు ఎంపికయ్యారు. దీప్తి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారు కాగా, జ్యోతి ఏపీలోని విశాఖపట్నం నివాసి.

నలుగురికి ఖేల్ రత్న..

2024 ఏడాదికి గాను గొప్ప ప్రదర్శనలు కనబరిచిన నలుగురు క్రీడాకారులను ఖేల్ రత్న కోసం ఎంపిక చేసింది. స్టార్ షూటర్ మను బాకర్, వరల్డ్ చెస్ ఛాంపియన్ షిప్ విజేత గుకేశ్ కుమార్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్‌లకు కేంద్రం ఖేల్ రత్న అవార్డును ప్రకటించింది.

జనవరి 17న రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు గ్రహీతలు తమ నత్కారాలను అందుకుంటారు.

జనవరి 6న చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం

-వర్చువల్‌గా రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం తేదీ ఖరారైంది. జనవరి 6వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ) వర్చువల్‌గా రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్నారు. రూ.413 కోట్లతో ఏర్పాటు చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను గతేడాది డిసెంబర్ 28 ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిచెందడంతో కార్యక్రమం వాయిదా పడింది.మాజీ ప్రధాని మృతి కారణంగా వారం రోజులపాటు కేంద్ర ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించింది. ఈ మేరకు కార్యక్రమం వాయిదా పడింది. అయితే తాజాగా జనవరి 6వ తేదీన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి నేరుగా పాల్గొనగా.. ప్రధాని మోదీ మాత్రం వర్చువల్‌గా హాజరై రైల్వే టెర్మినల్‌ను ప్రారంభిస్తారు. అయితే రెండు నెలల్లో మొత్తం నాలుగు సార్లు టెర్మినల్ ప్రారంభోత్సవం వాయిదా పడడం రైల్వే వర్గాలను తీవ్రంగా నిరాశపరిచింది. మరో కొత్త తేదీ ప్రకటించడంతో ఈసారైనా ఎలాంటి అవాంతరాలూ లేకుండా కార్యక్రమం జరగాలని రైల్వే అధికారులు, తెలంగాణ వాసులు కోరుకుంటున్నారు.

ప్రత్యేకతలివే..

జనవరి 6న చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైతే సుమారు 50 వేల మంది ప్రయాణికులకు మోక్షం లభిస్తుంది. గంటల తరబడి ట్రాఫిక్ సమస్య నుంచి వారికి విముక్తి కలుగుతుంది. చర్లపల్లి వద్ద ప్రస్తుతం 26 రైళ్లు ఆగుతుండగా.. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ప్రతి రోజూ 50 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. దీంతో వేగంగా గమ్య స్థానాలకు వెళ్లే అవకాశం ఉంటుంది. రైల్వే అధికారులు ప్రస్తుతం ఇక్కడ 2 ఎంఎంటీఎస్ ప్లాట్‌ఫాంలతో కలిపి మె?త్తం 9 ప్లాట్‌ఫాంలు, 6 ఎస్కలేటర్లు, 2 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రయాణికుల కోసం ఉచిత వైఫై సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు రచించారు. వెయిటింగ్ ఏసీ, నాన్ ఏసీ హాల్స్, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, రిజర్వేషన్ కౌంటర్లు, టికెట్ కౌంటర్లు వంటివి సైతం సిద్ధం చేశారు. ఇది ప్రారంభమైతే హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్లపై ప్రయాణికుల భారం తగ్గనుంది.

బిఎస్ఎన్ఎల్ రూ. 298 రీఛార్జ్ ప్లాన్.. 52 రోజులు చెల్లుబాటు, అపరిమిత కాలింగ్

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రముఖ టెలికాం సంస్థలు జిఓ ఐడియా, ఎయిర్ టెల్ రీఛార్జ్ ప్లాన్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. అయితే దేశంలోని యూజర్లందరూ తమ సిమ్‌ను బిఎస్ఎన్ఎల్ కు పోర్ట్ చేసుకున్నారు. దీనికి ప్రధాన కారణం ఈ బిఎస్ఎన్ఎల్ సరసమైన, చౌకైన రీఛార్జ్ ప్లాన్ లను అందించడం. ఈ క్రమంలోనే బిఎస్ఎన్ఎల్ తన వినియోగదారులకు చౌక రీఛార్జ్ ప్లాన్‌ల సౌకర్యాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా ఈరోజు రూ. 298 బాలెల ప్లాన్ గురించి తెలుసుకుందాం. బిఎస్ఎన్ఎల్ రూ. 298 రీఛార్జ్ ప్లాన్‌తో తమ వినియోగదారులకు అపరిమిత కాలింగ్, డేటా ప్రయోజనాలను అందిస్తుంది. ఈ ప్లాన్ చెల్లుబాటు పూర్తిగా 52 రోజుల వరకు అందుబాటులో ఉంది. అయితే ఇది 2 నెలల రీఛార్జ్ ప్లాన్‌కు చౌకైన ఎంపిక అని చెప్పవచ్చు. ఈ ప్లాన్ వివరాలు చూస్తే..న్ చెల్లుబాటు ? 52 రోజులుడేటా– 1ఉ:/రోజుకాలింగ్–అపరిమితఎస్ఏంఎస్ ? 100వాటూ/రోజుఅయితే, ఈ చౌకైన ప్లాన్ అపరిమిత కాల్స్ మాట్లాడేవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇది దాదాపు 2 నెలల పాటు అపరిమిత కాలింగ్ ప్రయోజనాలతో వస్తుంది. ఇంటర్నెట్‌కు సంబంధించి మొబైల్ రీఛార్జ్ ప్లాన్‌పై ఎక్కువగా ఆధారపడని వినియోగదారులకు కూడా ఇది ఉత్తమమైన ప్లాన్.

ప్రతి ఉద్యోగి కంపెనీ భవిష్యత్తుకు ప్రాధాన్యత ఇవ్వాలి : సీఎండీ బలరామ్

హైదరాబాద్, జనవరి 2:సింగరేణిలో పని చేస్తున్న ప్రతీ ఒక్క ఉద్యోగికి నమాజంలో మంచి గౌరవం, గుర్తింపు లభిస్తున్నాయని.. మనల్ని ఉన్నత స్థాయిలో నిలబెడుతున్న సంస్థ భవిష్యతే ప్రతీ ఒక్కరికీ ప్రథమ ప్రాధాన్యం కావాలని సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. సింగరేణి ఉజ్వల భవిష్యత్ కోసం ప్రతీ ఒక్కరూ తమకు కేటాయించిన 8 గంటల పాటు అంకితభావంతో పనిచేయాలన్నారు.

నూతన సంవత్సరం నేపథ్యంలో గురువారం సింగరేణి భవన్ లో ఉద్యోగులందరినీ ఉద్దేశించి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఏడాదిలో సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు ప్రతీ ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు.

ఉద్యోగుల పనితీరుపై పూర్తిస్థాయిలో మదింపు ఉంటుందని, పనిచేసే వారికి తగిన గుర్తింపు, నిర్లక్ష్యంగా ఉండే వారి పట్ల కఠిన చర్యలు ఉంటాయన్నారు. రక్షణ, నాణ్యతతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదక సాధించాలని, ప్రతీ ఒక్కరూ వారికి కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్, జీఎం కో ఆర్డినేషన్ ఎస్డి.ఎం.సుభానీ, జీఎం మార్కెటింగ్ రవి ప్రసాద్, జీఎ సోలార్ సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

టీజీ సెట్ సర్టిఫికెట్ల జారీ ప్రారంభం

హైదరాబాద్, జనవరి 2:ఉస్మానియా యూనివర్సిటీ : తెలంగాణ స్టేట్ – స్టేట్‌లెవెల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీ సెట్) సర్టిఫికెట్ల జారీని అధికారులు గురువారం ప్రారంభించారు. గతేడాది మేలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షా ఫలితాలను నవంబర్ 16న విడుదల చేశారు.

ధృవపత్రాల పరిశీలన పూర్తైన అనంతరం సర్టిఫికెట్ల జారీని మొదలుపెట్టారు.

ఓయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, సెట్ మెంబర్ సెక్రెటరీ, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్‌కుమార్ నాయక్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను జారీ చేశారు. అర్హత సాధించిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను సెట్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒరిజినల్ అక్‌నాలెడ్జ్‌మెంట్ స్లిప్‌తో వచ్చి తీసుకోవచ్చని పేర్కొన్నారు.

రైతు భరోసా అమలు కోసం కొత్తగా ఈ నెల 5 నుంచి రైతుల నుంచి దరఖాస్తులు

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయబోయే రైతు భరోసా పథకంపై కేబినెట్ సబ్ కమిటీ ఇవాళ చర్చించింది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు అధికారులు హాజరై, రైతు భరోసా విధివిధానాలపై చర్చించారు. ఎల్లుండి జరిగే కేబినెట్ సమావేశంలో రైతు భరోసా అమలుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.పంట సాగు చేసే ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, భూమి పరిమితి పెట్టొద్దని కమిటీ అభిప్రాయ పడినట్లు సమాచారం. రైతు భరోసా అమలు కోసం కొత్తగా రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉంది. అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములు గుర్తించాలని నిర్ణయించారు. సంక్రాంతి పండుగ(జనవరి 14) నుంచి రైతు భరోసా అమలు చేసే అవకాశం ఉంది. ధరణి ప్రకారం కోటి 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు సమాచారం. సాగు చేయని భూములు తీసేస్తే కోటి 30 లక్షల ఎకరాలకు రైతు భరోసా అందే అవకాశం ఉంది.

సీఎం రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సప్పిడి భాస్కర్

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్):);నూతన సంవత్సరం పురస్కరించుకొని తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని టి పి సి సి లేబర్ సెల్ – స్టేట్ కోఆర్డినేటర్ – సోషల్ మీడియ ఉ ప్రెసిడెంట్ (కూకట్ పల్లి నియోజకవర్గం) సప్పిడి భాస్కర్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలు కర పత్రాల ద్వారా లేబర్ సెల్ నాయకుల ప్రచారం గురించి సిఎం కు వివరించారు.

కొత్తగూడెం టు కొవ్వూరు.. రైల్వే లైన్‌కు కేంద్రం ఓకే

-తెలంగాణ ఏపీ మధ్య కొత్త రైల్వే లైన్
-2,115 కోట్లతో పనులు చేపట్టేందుకు సన్నాహాలు
-2030 వరకు పూర్తి కానున్న రైల్వే లైన్ పనులు
-హైదరాబాద్-విశాఖ మధ్య తగ్గనున్న ధూరం
-150 కిలోమీటర్లు కలిసి వస్తుందంటున్న ప్రయాణికులు
-1984లోనే కొవ్వూరు రైల్వే సాధనా కమిటీ ఏర్పాటు
-కొత్తగూడెం నుంచి కొవ్వూరుకు 22 రోజుల పాదయాత్ర
-ఇన్నాళ్లకు లభించిన మోక్షం.. ప్రజల్లో సంతోషం

హైదరాబాద్, జనవరి 2:కొత్తగూడెం, కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణం అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ నిర్మాణానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఈ లైన్ నిర్మాణం పూర్తం ఐతే.. హైదరాబాద్, విశాఖ మధ్య దాదాపు 150 కిలోమీటర్ల దూరం తగ్గనుంది.

సర్వేల పేరుతో కాలయాపన..

1964లో ఈ లైన్ నిర్మాణానికి బీజం పడింది. కానీ, ఇప్పటివరకు ప్రభుత్వాలన్నీ ప్రకటనలకే పరిమత మయ్యాయి. తెలంగాణ ఎంపీలు పార్లమెంట్ ఈ విషయం ప్రస్తావించినప్పుడు మాత్రమే కాస్త కదలిక వస్తోంది. ఆ తర్వాత అధికారులు సర్వేల పేరుతో దాటవేస్తూ వస్తున్నారు. అయితే.. ఇప్పుడు కూడా ఈ లైన్ విషయంలో కాస్త ఆశలు మొదలైనా, మళ్లీ పాత కథే ఉంటుందా అనే అనుమానాలు చాలామంది నుంచి వస్తున్నాయి.

2,115 కోట్లతో పనులు..

ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఈ రైల్వే లైన్ గురించి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టత ఇచ్చారు. రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. ?2,115 కోట్లతో ఈ ప్రాజెక్టును 2030 నాటికి పూర్తిచేస్తామని సమాధానమిచ్చారు.



1984లోనే రైల్వే సాధన కమిటీ..

కొత్తగూడెం –కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా.. 1984లో కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ ఏర్పాటైంది. పాండురంగాచార్యులు అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చంద్రుగొండ, అశ్వారావుపేట, సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు ప్రాంతాలకు ఈ కమిటీని విస్తరించింది. 2014 జనవరిలో నుంచి 22 రోజుల పాటు కొత్తగూడెం నుంచి కొవ్వూరు వరకు పాదయాత్ర కూడా నిర్వహించారు.

రెండు రాష్ట్రాల మధ్య తగ్గనున్న దూరం..

కొత్తగూడెం– కొవ్వూరు రైల్వేలైన్ పూర్తయితే హైదరాబాద్– విశాఖ మధ్య 150కి.మీ. దూరం తగ్గుతుంది. 2.30 గంటల జర్నీ సమయం ఆదా అవుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విశాఖకు విజయవాడ మీదుగా వెళ్తే 800కి.మీ. ప్రయాణించాలి. అదే కొత్తగూడెం– కొవ్వూరు లైన్ పూర్తయితే హైదరాబాద్ నుంచి విశాఖకు వయా కొత్తగూడెం అందుబాటులోకి వస్తుంది. 650 కి.మీ. ప్రయాణంతో విశాఖపట్నం చేరుకోవచ్చు.

బలగాల ఆత్మహత్యలు 40శాతం తగ్గాయన్న సీఐఎస్ఎఫ్..!

న్యూఢిల్లీ, జనవరి 2: భద్రతా బలగాల ఆత్మహత్యలు 40శాతం తగ్గాయని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ నివేదించింది. 2023లో 25 మంది సిబ్బంది ఆత్మహత్య చేసుకుంటే.. 2024లో కేవలం 15 మంది మాత్రమే సీఐఎస్ఎఫ్ జవాన్లు పలు కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు నివేదికలో పేర్కొంది. గత ఐదేళ్లలో జరిగిన ఆత్మహత్యల గణాంకాలను సెంట్రల్ ఫోర్స్ విడుదల చేసింది. 2024లో లక్ష జనాభాకు 9.87శాతం ఆత్మహత్య కేసులు నమోదయ్యాయి. 2023లో 16.98శాతం రికార్డయ్యాయి.గత ఐదేళ్లలో మొత్తం ఆత్మహత్య కేసులు, సంవత్సరాల వారీగా గణాంకాలను రిలీజ్ చేసింది. 2020లో 18 మంది ఆత్మహత్య చేసుకోగా.. 2021లో 21 మంది, 2022 సంవత్సరంలో 26 మంది.. 2023లో 25 మంది, 2024లో 15 మంది జవాన్లు ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలిపింది. ఆత్మహత్యలు తగ్గడానికి కారణాలను సైతం పేర్కొంది. ఆత్మహత్యల రేటు గణనీయంగా తగ్గడానికి కారణం సిబ్బంది మానసిక సమస్యల నుంచి బయటపడ్డారన్నారు. బలగాలను మానసిక స్థితిని పరిశీలించి.. ఆరోగ్యంగా ఉండేలా ఓ క్రమపద్ధతిలో చర్యలు తీసుకున్నట్లు సీఐఎస్ఎఫ్ వివరించింది.

దృఢమైన దేహంలో చురుకైన మెదడు తిష్టవేస్తుంది !

(03 జనవరి "అంతర్జాతీయ శారీరక మానసిక ఆరోగ్య దినం" సందర్భంగా)

శరీరం, మనస్సు, ఆత్మల సమతుల్యత మీదనే వ్యక్తుల సంపూర్ణ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని మనకు తెలుసు. మన శారీరక, మానసిక ఆరోగ్య సంరక్షణకు దోహదపడే దిన చర్యల్లో నడక, పరుగు, యోగా, సైక్లింగ్, ధ్యానం, ఆత్మావలోకనం, సృజనశీల కార్యక్రమాలు, వ్యాయామాలు లాంటి అంశాలు వస్తాయి. విద్యాలయాల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం నిత్యం గుర్తుచేసే నినాదం "ఆరోగ్యకర శరీరంలో ఆరోగ్యకర మనస్సు(సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ)" మనకు గుర్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరణ ప్రకారం "ఒక వ్యక్తి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, భావోద్వేగ, సామాజిక సమ్మిళిత ఆరోగ్యమే అసలైన సంపూర్ణ ఆరోగ్యమని" నిర్వచించింది. రోగం లేదా జ్వరం లేకపోవడం మాత్రమే సంపూర్ణ ఆరోగ్యానికి సంకేతం కాదని, మానసిక ఆరోగ్యం కూడా అత్యవసరమని తెలుస్తున్నది. మన శారీరక, మానసిక ఆరోగ్య ప్రాధాన్యాన్ని అవగాహన పరచడానికి ప్రతి ఏట 03 జనవరిన "అంతర్జాతీయ మనస్సు-శరీర ఆరోగ్య దినం (ఇంటర్నేషనల్ మైండ్-బాడీ వెల్‌నెస్ డే)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

పరిపూర్ణ ఆరోగ్య సిద్ధికి మనస్సు, శరీరం, ఆత్మల ఏకీకరణ:

మన శారీరం, మనస్సు, ఆత్మల సంతులిత సామరస్య ఆరోగ్యంపై మన భావోద్వేగాలు, పనులు, ఆధ్యాత్మిక ఆలోచనలు, అనుభవాలు, ధ్యేయాలు, నమ్మకాలు, అలవాట్లు, దిన చర్యలు ప్రభావాన్ని చూపుతాయి. 2025 నూతన సంవత్సరం అడుగిడుతున్న శుభ గడియల్లో ప్రతి ఒక్కరు తమ జీవనశైలిలో సానుకూల చిన్న చిన్న మార్పులు చేసుకుంటూ మనదైన శారీరక మానసిక సంపూర్ణ ఆరోగ్య సాధనకు కృషి చేయాలి. మన గురించి మనం ఆలోచించే సందర్భంగా నూతన సంవత్సర వేళల్ని వినియోగించుకోవాలి. ప్రతి చిన్న మార్పు రేపటి మన భారీ విజయానికి పునాదిగా పని చేస్తుందని గమనించాలి. 'మనలోనికి' మనం తొంగి చూడడం మరువరాదు. శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, భావోద్వేగ ప్రశాంతతల సమ్మేళనంగా సంపూర్ణ ఆరోగ్యం నిర్వచించబడింది.

వేగవంతమైన డిజిటల్ యుగపు జీవనశైలి:

నేటి వేగవంతమైన డిజిటల్ నెటిజెన్ల పరుగు పరుగుల జీవన విధానంలో శ్వాస తీసుకునే సమయం లేదు, విరామమనే పదానికే అర్థం లేకుండా పోతున్నది. ఇలాంటి అంతర్జాల వలయంలో చిక్కిన మనిషి కొంత సమయం తీసుకొని తన గురించి తాను కొన్ని క్షణాలు ఆలోచించాలి, అవసరమైన స్వల్ప మార్పులతో దిన చర్యను పరిపూర్ణ ఆరోగ్య దిశగా మార్చుకోవాలి. మనస్సు-శరీర శ్రేయస్సుకు సరైన నిద్ర, కొన్ని నిమిషాల ధ్యానం/యోగా, ఒత్తిడిని తగ్గించే విరామాలు, సంతోషకరమైన కుటుంబం లాంటి క్రియలను దినచర్యలో భాగం చేసుకొని ఆచరణలో పెట్టాలి. ఒక మంచి పుస్తకాన్ని చదవడం, సుస్వర సంగీతాన్ని వినడం, మనకు నచ్చిన కాఫీ లేదా టీ తాగడం, ప్రకృతి అందాలను ఆస్వాదించడం, పూల సుగంధాలను అనుభవించడం, గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం, పూజ చేసి పైవాడికా కృతజ్ఞతలు తెలుపడం, ప్రాణ మిత్రుడితో మాట్లాడడం లాంటివి కూడా మన మనసుకు ఉపశమనాన్ని ఇచ్చి, శారీరక మానసిక వికాసానికి ఉపకరిస్తాయి.

మనసు-శరీర సమతుల ఆరోగ్య సిద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర :

రేపటి పౌరులైన నేటి విద్యార్థినీవిద్యార్థులకు సరైన జీవనశైలి అలవర్చడంలో ఉపాధ్యాయుడు పాత్ర అమూల్యమని తెలుసుకోవాలి. విద్యార్థులు తమ గురించి తాము తెలుసుకోవడానికి తగు వేదికలను ఉపాధ్యాయుడు కల్పించాలి. విద్యార్థులు తమ అకడమిక్స్‌తో పాటు వ్యక్తిత్వ వికాసం, శారీరక మానసిక వికాసానికి దోహదపడే అంశాలను బోధించాలి. శారీరక ఆరోగ్యం, మానసిక సంతులిత సాధనకు విద్యాలయాలు వేదికలు కావాలి. మంచి అలవాట్లు, ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక విలువలకు పట్టం కట్టే విధంగా యువతకు మార్గనిర్దేశనం చేయాలి. "మొక్కై వంగనిదే మానై వంగునా" అన్న నినాదాన్ని దృష్టిలో పెట్టుకొని పాఠశాల స్థాయిలోనే సన్మార్గాలను చూపి ఆచరించే విధంగా బోధనలు కొనసాగాలి.

నూతన సంవత్సర గడపన నిలబడిన మనం ఈ ఏడాదిని ఒక సమోన్నత జీవనశైలిని ప్రసాదించిన సమయంగా సద్వినియోగం చేసుకోవాలి. నూతన సంవత్సర వేడుకలతో పాటు కొన్ని సానుకూల లక్ష్యాలను నిర్ణయించుకొని వాటి సాధనకు కృషి చేయాలి. మన ఆరోగ్యానికి విఘాతం కలిగించే విషతుల్య అలవాట్లకు స్వస్తి పలుకుతూ, ఆరోగ్య ప్రదాతలైన మంచి అలవాట్ల తలుపులు తెరవాలి. నేటి కన్న రేపు సంపూర్ణ ఆరోగ్య సాధన దిశగా ఒక ముందడుగు పడాలి. మన జీవితంలో మనం తీసుకున్న ప్రతి చిన్న మార్పు మన భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరే నిచ్చెన మెట్ల వలె ఉపకరించాలి. మన మనసు, దేహం, ఆత్మ త్రిమూర్తుల వలె మనకు పరిపూర్ణ ఆరోగ్యాలను ప్రసాదించాలి.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

రైతులకు తక్కువ ధరలకు డీఏపీని నిరంతరం అందుబాటులో ఉంచడమే లక్ష్యం

న్యూఢిల్లీ, జనవరి 2: డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ)పై ఎన్ బిఎస్ సబ్సిడీకి అదనంగా మెట్రిక్ టన్నుకు రూ.3,500 ప్రత్యేక ప్యాకేజీని 01.01.2025 నుండి తదుపరి ఉత్తర్వుల వరకు పొడిగించాలన్న ఎరువుల శాఖ ప్రతిపాదనకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రైతులకు డీఏపిని తక్కువ ధరలో స్థిరంగా అందుబాటులో ఉంచడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రయోజనాలు:

రైతులకు డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డిఎపి) ని సబ్సిడీతో, వారు భరించ గలిగే, న్యాయమైన ధరల వద్ద అందుబాటులో ఉంచుతారు.

అమలు వ్యూహం-లక్ష్యాలు:

రైతులకు సహేతుకమైన ధరకు డీఏపీ ఎరువులు సజావుగా లభించేలా ఆమోదిత ఎన్బిఎస్ సబ్సిడీకి మించి మెట్రిక్ టన్నుకు రూ.3,500 చొప్పున ప్రత్యేక ప్యాకేజీని 01.01.2025 నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు అందిస్తారు.

నేపథ్యం:

ఎరువుల తయారీదారులు/దిగుమతిదారుల ద్వారా 28 రకాల పీ అండ్ కే ఎరువులు రైతులకు సబ్సిడీ ధరలకు లభిస్తాయి. పీ అండ్ కే ఎరువులపై 01.04.2010 నుండి ఎన్బిఎస్ పథకం కింద సబ్సిడీ ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ, డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ) ఎరువుల ధరను నిలకడగా ఉంచడం ద్వారా రైతులకు భారీ ఉపశమనం కల్పించింది. భౌగోళిక-రాజకీయ అవరోధాలు, ప్రపంచ మార్కెట్ పరిస్థితుల అస్థిరత ఉన్నప్పటికీ, 2024-25 ఖరీఫ్, రబీలో రైతులకు సహేతుక ధరకు డిఏపిని అందించడం ద్వారా రైతు స్నేహపూర్వక విధానం పట్ల ప్రభుత్వం తన నిబద్ధతను కొనసాగించింది. 01.04.2024 నుంచి 31.12.2024 వరకు రూ.2,625 కోట్ల ఆర్థిక భారంతో ఎన్బీఎస్ సబ్సిడీకి మించి డీఏపీపై వన్ టైమ్ ప్రత్యేక ప్యాకేజీకి 2024 జూలైలో కేబినెట్ ఆమోదం తెలిపింది.

'జమ్మూ కాశ్మీర్ అండ్ లద్దాఖ్: త్రూ ది ఏజెస్' పుస్తకాన్ని న్యూఢిల్లీలో ఆవిష్కరించిన శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, జనవరి 2:కేంద్ర హోం వ్యవహారాలు, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా 2025 జనవరి 2న న్యూఢిల్లీలో జరగబోయే ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనడంతోపాటు అధ్యక్ష బాధ్యతలను కూడా నిర్వహించనున్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొంటారు. ప్రముఖ రచయితలు, విద్యావేత్తలు, మంత్రిత్వ శాఖకు చెందిన అధికారులు, ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారు.

జమ్మూ కాశ్మీర్, లద్దాఖ్‌ల ప్రస్తుత స్థితిగతులను 'జమ్మూ కాశ్మీర్ అండ్ లద్దాఖ్: త్రూ ది ఏజెస్' పుస్తకంలో పొందుపరిచారు. జమ్మూ కాశ్మీర్, లద్దాఖ్‌ల కథను సంబంధిత విషయ నిపుణులతోపాటు ఆ ప్రాంతాల గురించి అంత పెద్దగా అవగాహన లేని వ్యక్తులకు కూడా ఈ గ్రంథం సమగ్రంగా తెలియజెప్పే ప్రయత్నం చేస్తుంది. మూడు వేల సంవత్సరాలకు మించిన ఆ ప్రాంత చరిత్రను ఈ గ్రంథంలో ఏడు భాగాలలో వివరించారు. కాలాను గుణంగా ఉన్న ప్రాముఖ్యాన్నీ, భారత దేశ చరిత్రకు సంబంధించిన ఓ విశాల యవనికలో ఈ ప్రాంతానికున్న పాత్రనూ అత్యంత శ్రద్ధతో చిత్రిక పట్టి మరీ నిదర్శనాలుగా ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఈ పుస్తకాన్ని నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసెర్చ్ సంయుక్త సహకారంతో సిద్ధం చేసి హిందీలోనూ, ఇంగ్లిషులోనూ ప్రచురించారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం మార్పులకు మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 2:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం రూ.69,515.71 కోట్ల వ్యయంతో (2021-22 నుంచి 2025-26 వరకూ) ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని 2025-26 వరకు కొనసాగించడానికి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం 2025-26 వరకు దేశవ్యాప్తంగా రైతులకు అనివార్య ప్రకృతి వైపరీత్యాల నుండి పంటలను రక్షించడానికి సహాయపడుతుంది.

దీనికితోడు పారదర్శకత, క్లెయిమ్ లెక్కింపు, సెటిల్ మెంట్ సామర్థ్యం పెంచేందుకు వీలుగా ఈ పథకం అమలులో పెద్ద ఎత్తున సాంకేతిక పరిజ్ఞానం కోసం రూ.824.77 కోట్లతో ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ (ఫియట్) ఏర్పాటుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఈ పథకం కింద సాంకేతిక కార్యక్రమాలైన యస్-టెక్, విండ్స్, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ స్టడీస్ కోసం ఈ నిధులను వినియోగించనున్నారు. టెక్నాలజీ ఆధారిత దిగుబడి అంచనా వ్యవస్థ (ఎస్- టెక్) ద్వారా దిగుబడి అంచనాకు రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీని ఉపయోగిస్తుంది. అందులో టెక్నాలజీ ఆధారిత దిగుబడి అంచనాలకు కనీసం 30% ప్రాధాన్యత ఇస్తారు. తొమ్మిది ప్రధాన రాష్ట్రాలు – ఏపీ, అస్సాం, హర్యానా, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక దీనిని ప్రస్తుతం అమలు చేస్తుండగా, ఇతర రాష్ట్రాలను కూడా త్వరితగతిన దీని పరిధిలోకి తెస్తున్నారు. ఎస్-టెక్ ను విస్తృతంగా అమలు చేయడంతో, పంట కోత ప్రయోగాలు, సంబంధిత సమస్యలు క్రమంగా తొలగిపోతున్నాయి. 2023-24 సంవత్సరానికి ఎస్-టెక్ క్లెయిమ్ లెక్కింపు, సెటిల్మెంట్ పూర్తయింది. మధ్యప్రదేశ్ 100% సాంకేతిక ఆధారిత దిగుబడి అంచనాను అమలు చేసింది.

వెదర్ ఇన్ఫర్మేషన్ అండ్ నెట్వర్క్ డేటా సిస్టమ్స్ (విండ్స్) బ్లాక్ స్థాయిలో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు (ఏడబ్ల్యూఎస్), పంచాయతీ స్థాయిలో ఆటోమేటిక్ రెయిన్ గేజ్ (ఏఆర్జీ) లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. విండ్స్ కింద, హైపర్ లోకల్ వాతావరణ డేటాను అభివృద్ధి చేయడానికి ప్రస్తుత నెట్‌వర్క్ సాంద్రతను 5 రెట్లు పెంచడం కూడా లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ కార్యక్రమం కింద, డేటా అద్దె ఖర్చులను మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయి. తొమ్మిది ప్రధాన రాష్ట్రాలలో కేరళ, ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ పుదుచ్చేరి, అస్సాం, ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్, రాజస్థాన్లలో విండ్స్ ను అమలుచేసే ప్రక్రియ పురోగతిలో ఉంది. ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశాయి.

టెండరింగ్ కు ముందు అవసరమైన వివిధ నేపథ్య సన్నాహక, ప్రణాళిక పనుల కారణంగా 2023-24 (ఇఎఫ్ సి ప్రకారం మొదటి సంవత్సరం) లో రాష్ట్రాలు విండ్స్ ను అమలు చేయలేకపోయాయి. దీని ప్రకారం 90:10 నిష్పత్తిలో అధిక కేంద్ర నిధుల భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రయోజనం చేకూర్చడానికి 2023-24తో గాక 2024-25ను మొదటి సంవత్సరంగా కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.

ఈశాన్య రాష్ట్రాల రైతులందరినీ ప్రాధాన్య క్రమంలో ప్రోత్సహించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ మేరకు ప్రీమియం సబ్సిడీలో 90 శాతం ఈశాన్య రాష్ట్రాలతో కేంద్రం పంచుకుంటుంది. అయితే ఈ పథకం స్వచ్ఛందం కావడం, ఈశాన్య రాష్ట్రాలు తక్కువ పంటలు పండే ప్రాంతం కావడంతో నిధులను వెనక్కు తీసుకోకుండా నిధుల అవసరం ఉన్న ఇతర అభివృద్ధి ప్రాజెక్టులు, పథకాల్లో వాడేందుకు (రీలోకేషన్) వెసులుబాటు కల్పించారు.

డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డిఎపి) పై ఎన్బిఎస్ సబ్సిడీకి అదనంగా వన్ టైమ్ స్పెషల్ ప్యాకేజీని పొడిగించడానికి కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 2: డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ)పై ఎన్ బిఎస్ సబ్సిడీకి అదనంగా మెట్రిక్ టన్నుకు రూ.3,500 ప్రత్యేక ప్యాకేజీని 01.01.2025 నుండి తదుపరి ఉత్తర్వుల వరకు పొడిగించాలన్న ఎరువుల శాఖ ప్రతిపాదనకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రైతులకు డిఏపి ని తక్కువ ధరలో స్థిరంగా అందుబాటులో ఉంచడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రయోజనాలు:

రైతులకు డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డిఎపి) ని సబ్సిడీతో, వారు భరించ గలిగే, న్యాయమైన ధరల వద్ద అందుబాటులో ఉంచుతారు.

అమలు వ్యూహం-లక్ష్యాలు:

రైతులకు సహేతుకమైన ధరకు డీఏపీ ఎరువులు సజావుగా లభించేలా ఆమోదిత ఎన్బిఎస్ సబ్సిడీకి మించి మెట్రిక్ టన్నుకు రూ.3,500 చొప్పున ప్రత్యేక ప్యాకేజీని 01.01.2025 నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు అందిస్తారు.

నేపథ్యం:

ఎరువుల తయారీదారులు/దిగుమతిదారుల ద్వారా 28 రకాల పీ అండ్ కే ఎరువులు రైతులకు సబ్సిడీ ధరలకు లభిస్తాయి. పీ అండ్ కే ఎరువులపై 01.04.2010 నుండి ఎన్బిఎస్ పథకం కింద సబ్సిడీ ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ, డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ) ఎరువుల ధరను నిలకడగా ఉంచడం ద్వారా రైతులకు భారీ ఉపశమనం కల్పించింది. భౌగోళిక-రాజకీయ అవరోధాలు, ప్రపంచ మార్కెట్ పరిస్థితుల అస్థిరత ఉన్నప్పటికీ, 2024-25 ఖరీఫ్, రబీలో రైతులకు సహేతుక ధరకు డిఏపిని అందించడం ద్వారా రైతు స్నేహపూర్వక విధానం పట్ల ప్రభుత్వం తన నిబద్ధతను కొనసాగించింది. 01.04.2024 నుంచి 31.12.2024 వరకు రూ.2,625 కోట్ల ఆర్థిక భారంతో ఎన్బీఎస్ సబ్సిడీకి మించి డీఏపీపై వన్ టైమ్ ప్రత్యేక ప్యాకేజీకి 2024 జూలైలో కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఎస్సీ వర్గీకరణపై వన్ మ్యాన్ కమిషన్ వినతుల స్వీకరణ

-కర్నూల్‌లో కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసు బందోబస్తు
-మూడంచెల భద్రత మధ్య లోనికి అనుమతి

కర్నూల్, జనవరి 2:షెడ్యూల్డ్ కులముల ఉపవర్గీకరణపై ప్రజలు, వివిధ కుల సంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలు, వినితుల స్వీకరణలో భాగంగా గురువారం కర్నూల్ కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో రాజీవ్ రంజన్ మిశ్రా వన్ మాన్ కమిటీ.. సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూల్ కలెక్టరేట్ కి వివిధ షెడ్యూల్డ్ కులాలకు చెందిన కుల సంఘం నాయకులు, ఇతరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడంచెల భద్రత మధ్య టోకెన్లు ఇచ్చిన వారిని మాత్రమే కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలోకి అనుమతించారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఏబీసీడీలు చేయాలా వద్దా.. చేస్తే ఎవరికి ఎంత పర్సంటేజీ.. అన్న అంశంపై ప్రధానంగా వినతులను ఆయా కుల సంఘాల నుంచి తీసుకోవడం జరిగింది.

కుల సంఘం నేతల అభిప్రాయాలు..

వన్ మ్యాన్ కమిషన్ కాకుండా, త్రీ మ్యాన్ కమిషన్ ను నియమించాలని, రాష్ట్రంలో రిజర్వేషన్లు విభజించేందుకు ఏర్పాటు చేసిన వన్ మ్యాన్ కమిషన్ రద్దు చేయాలని మాల మహానాడు నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధిక శాతం ఉన్న దళితులకు 25శాతం రిజర్వేషను అమలు చెయ్యాలి. పంజాబ్ రాష్ట్రంలో జరుగుతున్న రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్న మందక్రిష్ణ ఈ రాష్ట్రంలో అమలు కావాలంటే ఎందుకు ఒప్పుకోవడం లేదు. పంజాబ్ రాష్ట్రంలో 25శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరుగుతుంది. అదే విధంగా మన రాష్ట్రంలో కూడా 25శాతం రిజర్వేషన్లు అమలు చెయ్యాలి. మంద కృష్ణ మాదిగ దళితుల అభివృద్ధిని ఎందుకు ఓర్చుకోలేకపోతున్నాడో అర్థం కావడం లేదని ప్రశ్నించారు.

మాదాసి కురువను అనుమతించవద్దు..

ఏబీసీ వర్గీకరణలో మాదాసి కురువను అనుమతించవద్దని.. మాల మహానాడుకు చెందిన కొందరు నేతలు డిమాండ్ చేశారు. వినతులు స్వీకరించే వద్ద వారికి టోకెన్లు ఇవ్వవద్దని నిరసనకు దిగారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

బుడగజంగాలను ఎస్సీలో చేర్చాలి..

2008కి పూర్వం ఎస్సీలుగా ఉన్న బుడగ జంగాలను తిరిగి ఎస్సీలుగా గుర్తించాలని బుడగ జంగం రాష్ట్ర నాయకులు మనోహర్ డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. బుడగ జంగాలు పడుతున్న ఇబ్బందలను కమిషన్ దృష్టికి తెచ్చారు.

రోడ్డెక్కిన గురుకులం విద్యార్థులు

కర్నూల్ జనవరి 2: ఎమ్మిగనూరు పరిధిలోని బనవాసి గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు గురువారం నిరసనకు దిగారు. విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన లైబ్రేరియన్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్, సురేంద్ర మాట్లాడుతూ.. ఈ ఘటనపై సీఎం, జిల్లా మంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. లైబ్రేరియన్ పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు విద్యార్థి సంఘం నేతలను అదుపులోకి తీసుకున్నారు.

యాదాద్రి జిల్లాలో 16 మంది ప్రభుత్వ టీచర్లను విధుల్లో నుంచి తొలగింపు

యాదాద్రి భువనగిరి జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);యాదాద్రి భువనగిరి జిల్లాలో దీర్ఘకాలికంగా విధులకు డుమ్మా కొడుతున్న 16 మంది టీచర్లపై వేటు పడింది. వారిని సర్వీస్ నుంచి తొలగిస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాఠశాలకు రాకుండానే అన్ని సదుపాయాలు పొందుతున్నారు. స్కూల్ అసిస్టెంట్ గీతారాణి, ఎస్జీటీలు విజయలక్ష్మీ, శ్రీనివాస్ రెడ్డి, ఉమారాణి, ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్ హమీద్, స్వప్న, మాధవి, నవీన్ కుమార్, ఎం.ఉమాదేవి, క్రాంతి కిరణ్, జె.ఉమాదేవి, నర్సింహారావు, శైలజ, భాగ్యలక్ష్మీ, కిరణ్‌కుమారి 2005 నుంచి 2022 వరకు అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యారు. ఈ విషయం విద్యాశాఖ దృష్టికి వెళ్లడంతో.. దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరవ్వడంపై వివరణ ఇవ్వాలని సదరు ఉపాధ్యాయులను నోటీసులు ఇచ్చింది. అయినప్పటికీ స్పందించలేదు.దీంతో విద్యాశాఖ అధికారులు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి 16 మంది ఉపాధ్యాయులను సర్వీసు నుంచి తొలగించారు. ఈ విషయాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా డీఈవో సత్యనారాయణ తెలిపారు.యాదాద్రి జిల్లాలో 16 మంది ప్రభుత్వ టీచర్లను విధుల్లో నుంచి తొలగించారు. వీరు దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరు కావడంతో డీఈవో ఇటీవల నోటీసులిచ్చారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మద్యం మత్తులో భర్త .. ఉరివేసి చంపిన భార్య..

అమరావతి, జనవరి 2:ఏపీలో దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భర్తను అతని భార్య నడిరోడ్డుపై ఉరివేసి చంపింది. బాపట్ల జిల్లాలో ఈ దారుణమైన ఘటన జరిగింది. పట్టపగలే భర్తను భార్య కొట్టి, ఉరేసి చంపిన ఈ ఘటన ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరేందర్ అరుణ దంపతులు కొంతకాలంగా నిజాంపట్నం మండలంలోని కొత్తపాలెంలో నివాసం ఉంటున్నారు. గురువారం, ఇద్దరు సడెన్‌గా రోడ్డు మీద చేరుకుని గొడవ మొదలుపెట్టారు. మాటామాటా పెరిగి పరస్పరం కొట్టుకున్నారు.

ఈ సమయంలో భార్య వివేకాన్ని కోల్పోయి, భర్త అమరేందర్ తలపై కర్రతో గట్టిగా కొట్టింది. దీంతో అమరేందర్ కిందపడిపోయాడు. అప్పటికే అమరేందర్‌కి గాయాలు అయినా సరే.. అరుణ అక్కడితో ఆగకుండా అమరేందర్ గొంతుకు తాడుతో ఉరేసింది. ఈ ఘటనలో అమరేందర్ అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు.

గ్రామస్తులు ఈ సంఘటన గురించి పోలీసులకు సమాచారం అందించడంతో.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అరుణను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను అరెస్ట్ చేసి, అమరేందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మద్యానికి బానిసైన అమరేందర్.. ఎప్పటిలానే ఈరోజు కూడా తాగి భార్య అరుణతో గొడవపడగా ఈ దారుణం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

కానిస్టేబుల్ రిక్రూట్మెంట్‌లో అపశృతి-అభ్యర్థి మృతి

అమరావతి, జనవరి 2: కృష్ణాజిల్లాలో నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల దేహ దారుఢ్య పరీక్షలో అపశృతి చోటుచేసుకుంది. 1600 మీటర్ల పరుగు పందెంలో పడిపోయిన యువకుడు చికిత్స అందిస్తుండగా మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో మృతిచెందాడు.. మృతి చెందిన అభ్యర్థి కృష్ణాజిల్లా ఏ కొండూరు గ్రామానికి చెందిన ఎన్ చంద్రశేఖర్ (25)గా గుర్తించారు..

కాగా, ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డ్ గత కొన్ని రోజులుగా ఉద్యోగ నియమగా ప్రక్రియలో ప్రిలిమినరీ పరీక్ష ఉత్తీర్ణత పొందిన వారికి శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తోంది.. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన అభ్యర్థులకు లక్ష్మి టాకీస్ సెంటర్‌లోని పోలీస్ కా ర్యాలయాన్ని పోలీస్ పెరల్స్ (గ్రౌండ్స్) నందు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తు న్నారు.. ఓ అభ్యర్థి ఈ ఈవెంట్స్ చేస్తూ ఉండగా పడిపోయాడు.. వెంటనే అక్కడ ఉన్న పోలీస్ సిబ్బంది చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలి ంచారు. వైద్యులు చికిత్స అందిస్తుం డగా మృతి చెందాడు.

ఉద్యోగం సాధి ంచి కుటుంబ సభ్యులను పోషిస్తాడని ఆశతో ఎదురుచూసిన తల్లిదండ్రులు ఈ చేదు వార్త కన్నీటిని మిగిల్చింది.

మన కిసానుల సమృద్ధిని పెంచేందుకు అంకితమైంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 2:నూతన సంవత్సరం 2025లో నిర్వహించిన మొట్టమొదటి మంత్రిమండలి సమావేశంలో కీలక నిర్ణయాల్ని తీసుకున్న నేపథ్యంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మాట్లాడుతూ, రైతులకు మరింతగా మంచి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు.

"మా ప్రభుత్వం రైతులకు మేలు చేయడానికి పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంది. మన దేశ ప్రజలకు అన్నం పెట్టడానికి ఆరుగాలం కష్టపడుతున్న మన రైతు సోదరులను, మన రైతు సోదరీమణులను చూసుకొని మనమందరం గర్విస్తున్నాం.



అమరావతి పనులకు గ్రీన్ సిగ్నల్ - మున్సిపల్ చట్ట సవరణకు ఓకే

-మున్సిపల్ చట్ట సవరణకు ఓకే
-పిఠాపురం అభివృద్ధి మండలికి పోస్టులు మంజూరు
-తిరుపతి ఈఎస్ఐ హాస్పటల్ పడకలు పెంపు
-రూ.1,82,162 కోట్ల ఎస్ఐపిబి పెట్టుబడులకు ముద్ర
-విశాఖలో టిసిఎస్ క్యాంపస్ కూ గ్రీన్ సిగ్నల్
-14 అంశాలపై చంద్రబాబు కేబినేట్ లో చర్చ
-అన్నింటికి మంత్రి మండలి ఆమోదం

అమరావతి, జనవరి 2:అమరావతిలో రూ.2,733 కోట్లతో చేపట్టనున్న పనులతో పాటు సీఆర్డీఏ 44వ సమావేశం లో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది చంద్రబాబు కేబినెట్ . మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు అంగీకారం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన నేడు ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు.. మొత్తం 14 అంశాల పై ఏపీ కేబినెట్ చర్చించింది. రైతు సాయాన్ని రూ.20 వేలకు పెంచింది కేబినెట్. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 10 వేలకు అదనంగా మరో పదివేల కలిపి ఇవ్వాలని మంత్రివర్గ నిర్ణయించింది. అలాగే మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఏక మొత్తంలో రూ.20 వేలు ఇచ్చేందుకు చంద్రబాబు మంత్రి వర్గం ఆమోదముద్ర వేసింది..

పిఠాపురం ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ లో కొత్తగా 19 పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఏపీ ఎంఆర్యూడీఏ చట్టం 2016లో భవనాల లేఅవుట్ల అనుమతులను మున్సిపాలిటీలకు అప్పగిస్తూ సవరణ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీలో కొత్తగా 19 పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రి పడకలను 100కి పెంపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ, కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుపై కేబినెట్ మీటింగ్లో చర్చించారు. అలానే చిత్తూరు జిల్లాలో హోంశాఖ ఐఆర్ బెటాలియన్ ఏర్పాటుకు కేటాయించనున్న స్థలంపై క్యాబినెట్‌లో చర్చ జరగింది . నంద్యాల, వైఎస్ఆర్, కర్నూలు జిల్లాల్లో పవన, సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ అంగీకారం తెలిపింది.

పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

ఎస్ఐపిబి అమోదించిన రూ.1,82,162 కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ అమోదం తెలపింది. ఈ పెట్టుబడులు వలన 2,63,411 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశముంది. నెల్లూరు జిల్లా రామయ్యపట్నంలో 6 వేల ఎకరాల్లో రూ. 96,862 కోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ భారీ రిఫైనరీ ఏర్పాటుకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్. దీని వలన 2,400 మందికి ఉపాధి కలగనుంది. మొత్తం 9 మిలియన్ మెట్రిక్ టన్నులు సామర్థ్యంతో ఐదు బ్లాకుల్లో రానున్న ఈ ప్రాజెక్టులో టౌన్‌షిప్, లెర్నింగ్ సెంటర్, రిఫైనరీ, పెట్రోకెమికల్స్ యూనిట్స్, క్రూడ్ ఆయిల్ టెర్మినల్, గ్రీన్ హెచ్2, అడ్మినిస్ట్రేషన్ బ్లాకులు నిర్మించనున్నారు.

విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్‌లో 2,08,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో టీసీఎస్ రూ. 80 కోట్ల పెట్టుబడులకు అమోదం తెలిపింది. దీంతో 2 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా, గుడిపల్లిలో ఆజాద్ మొబిలిటీ ఇండియా లిమిటెడ్ సంస్థ ఎలక్ట్రిక్ త్రీ వీలర్ ట్రక్కులు, బస్సులు, బ్యాటరీ ప్యాక్‌ల కోసం ఈ సంస్థ రూ. 1,046 కోట్ల పెట్టుబడిలకు క్యాబినెట్ ఓకే చెప్పింది. దీని ద్వారా 2,381 మందికి ఉపాధి కలుగనుంది..

అనకాపల్లి జిల్లా రాంబిల్లిలోని 106 ఎకరాల్లో బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1,174 కోట్ల పెట్టుబడులకు , ది. రాష్ట్రంలో కొత్తగా ఐదు సంస్థలు క్లీన్ ఎనర్జీలో రూ. 83 వేల కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. వీటితోపాటు సీఎం చంద్రబాబు తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని పేర్కొన్న రాష్ట్రంలోని నదుల అనుసంధానం గోదావరి టూ బనకచర్ల ప్రాజెక్టుపై క్యాబినెట్‌లో చర్చించారు

నాలుక కోసి శివ లింగానికి సమర్పించుకున్న 17 ఏళ్ల బాలిక

రాయ్‌పూర్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : 17 ఏళ్ల బాలిక నాలుక కోసి శివ లింగానికి సమర్పించుకున్న అనంతరం ఆమె ధ్యానంలోకి వెళ్లిపోయింది. ఈ సంఘటన ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం?. దభ్రా ప్రాంతంలోని దేవరఘటా గ్రామంలో 17 ఏళ్ల బాలిక శివుడి గుడిలోకి వెళ్లింది. శివ లింగ ముందు కూర్చొని నాలుగు కోసి సమర్పించుకుంది. లోపల నుంచి దేవాలయానికి గడియ పెట్టుకొని ధ్యానం చేస్తున్నానని.. తనకు భంగం కలిగించొద్దని ప్రజలకు సమాచారం ఇచ్చింది. ఆ బాలికకు గ్రామస్థులు, తల్లిదండ్రులు మద్దతు పలికారు. ఎవరైనా తన ధ్యానానికి భంగం కలిగిస్తే గ్రామంలో హత్య జరుగుతుందని తెలిపింది. దీంతో గ్రామస్థులు ఎవరు ఆ దేవాలయంలోని వెళ్లనివ్వడం లేదు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, అధికారులు దేవాలయం వద్దకు చేరుకొని బాలిక ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆమె ప్రస్తుతం భోజనం తింటుందని, ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు వెల్లడించారు. బాలిక దైవభక్తి పిచ్చి పీక్ స్టేజీకి చేరిందని నెటిజన్లు మండిపడుతున్నారు. బాలికతో పాటు గ్రామస్థులకు కౌన్సిలింగ్ ఇప్పించాలని నెటిజన్లు కోరుతున్నారు.

కోటి మంది టిడిపి కార్యకర్తలకు 5 లక్షల ప్రమాద బీమా

-ఇన్స్యూరెన్స్ కంపెనీలతో ఒప్పందం
-ఓఎంయుపై సంతకం చేసిన నారా లోకేష్
-ప్రీమియం కింద రూ.42 కోట్లు చెల్లింపు

అమరావతి, జనవరి 2:కోటి మంది కార్యకర్తలకు ప్రమాద బీమా కల్పించేలా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇన్సూరెన్స్ కంపెనీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఉండవల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఈమేరకు మంత్రి లోకేష్, యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్, ప్రాగ్మాటిక్ ఇన్స్యూరెన్స్ బ్రోకింగ్ ప్రతినిధులు ఎంఓయుపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం జనవరి 1, 2025 నుంచి డిసెంబర్ 31,2025వరకు కోటి మంది కార్యకర్తల భీమా కోసం తొలివిడతలో రూ.42కోట్ల రూపాయలు పార్టీ చెల్లించింది. వచ్చే ఏడాది కూడా దాదాపు ఇదే మొత్తంలో ప్రీమియం సొమ్మును పార్టీనే చెల్లిస్తుంది. ఈ ఒప్పందం ప్రకారం కార్యకర్తలకు రూ.5లక్షల ప్రమాద భీమా లభిస్తుంది.

ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, కార్యకర్తల సంక్షేమనిధి సారధిగా తాను బాధ్యతలు చేపట్టాక కేడర్ సంక్షేమమే లక్ష్యంగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నానని చెప్పారు.. కార్యకర్తల సంక్షేమానికి ఇప్పటి వరకూ రూ.138కోట్లు ఖర్చు చేసామన్నారు. గత అరాచక ప్రభుత్వంలో కేసుల్లో ఇరుక్కున్న కేడర్ కోసం న్యాయవిభాగాన్ని ఏర్పాటు చేసామని వెల్లడించారు. వివిధ ప్రమాదాల్లో దెబ్బతిన్న కార్యకర్తలను ఆదుకునేందుకు కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సెల్ ను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.. మృతిచెందిన కార్యకర్తల పిల్లల కోసం హైదరాబాద్ తోపాటు కృష్ణాజిల్లా చల్లపల్లిలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటుచేసి ఉచితంగా విద్యనందిస్తున్నామని చెప్పారు.. టిడిపిలో సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు పార్టీపరంగా అన్నివిధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు లోకేష్ ..

సంక్రాంతి ముందే కత్తులు దూస్తున్నకోళ్లు

అమరావతి, జనవరి 2: ఏపీలో సంక్రాంతికి ముందే కోళ్లు కత్తులు దూస్తున్నాయి. పొంగల్‌కి రెండు వారాల ముందే పందెం రాయుళ్లు కాయ్ రాజా కాయ్ అంటున్నారు. బరులు గీసి బస్తీ మే సవాల్ అంటున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోనూ కోడి పందాలు షురూ అయ్యాయ్. నూతన సంవత్సరం సందర్భంగా పెద్ద ఉత్తున చేరుకున్న అభిమానుల మధ్య పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ 13 రోజులు ముందే పిఠాపురంలో సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. కోడి పందాలకు పచ్చజెండా ఊపారు. కత్తులు కట్టని కోడిపుంజులను దువ్వి మరీ బరిలోకి దింపారు వర్మ. పందెంలో అలసిపోయిన కోడిపుంజుకు నోటితో నీళ్లు కొట్టి పందానికి పంపారు. అభిమానుల కేరింతల మధ్య కొద్దిసేపు కోడి పందాలును వీక్షించారు. ఈ సందర్భంగా.. సంప్రదాయాలను కూటమి ప్రభుత్వం గౌరవిస్తుందన్నారు వర్మ.

సంప్రదాయ పోటీలకు పెద్ద పీట..

పిఠాపురంలో సాంప్రదాయ కోడి పందాలు, ఎడ్ల పందాలు జరుగుతాయని ప్రకటించారు వర్మ. అయితే.. కోడిపుంజులకు కత్తులు కట్టకుండా, హింసించకుండా జరిగే సాంప్రదాయాలను మాత్రమే ప్రోత్సహిస్తామని చెప్పారు. గ్యాంబ్లింగ్ లాంటి జూదాలను ఆడకూడదని పిలుపునిచ్చారు. గ్యాంబ్లింగ్ ఆడడం చట్ట వ్యతిరేకమని స్పష్టం చేశారు

చిన్మోయ్ కృష్ణ దాస్ కు బెయిల్ నిరాకరించిన బంగ్లాదేశ్ కోర్టు

న్యూఢిల్లీ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ హిందూ సాధువు చిన్మోయ్ కృష్ణ దాస్ బ్రహ్మచారికి ఎదురుదెబ్బ తగిలింది. బంగ్లాదేశ్‌లోని ఛటోగ్రామ్ కోర్టు గురువారం ఆయనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. కృష్ణదాస్ బెయిల్ కోసం 11 మంది న్యాయవాదులు ఆయన తరుపున వాదనలు వినిపించినా లాభం లేకపోయింది. విచారణ సందర్భంగా కోర్టు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టు బెయిల్ ఇవ్వకపోవడంపై ఇస్కాన్ కోల్‌కతా వైస్ ప్రెసిడెంట్ రాధా రామన్ దాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. హిందూ సన్యాసికి న్యాయం జరిగేలా చూడాలని బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. కాగా, నవంబర్ 26న దేశద్రోహ నేరం కింద కృష్ణ దాస్ ను అరెస్టు చేసి జైలుకు పంపించారు.

నకిలీ ఔషధాలపై కేంద్ర ఆరోగ్య శాఖ కఠిన చర్యలు.. కలకత్తాలో భారీగా స్వాధీనం

న్యూఢిల్లీ, జనవరి 2:నకిలీ ఔషధాల అక్రమ వాణిజ్యాన్ని నిరోధించే దిశగా నిశ్చయాత్మక చర్యలు తీసుకుంటున్న తూర్పు జోన్ కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్సీవో), పశ్చిమ బెంగాల్ ఔషధ నియంత్రణ డైరెక్టొరేట్ సంయుక్తంగా కలకత్తాలోని ఓ హోల్ సేల్ సంస్థ ప్రాంగణంలో సోదాలు నిర్వహించాయి. కలకత్తాలోని ఎం/ఎస్ కేర్ అండ్ క్యూర్ ఫర్ యూలో సోదాలు నిర్వహించి.. నకిలీవిగా భావిస్తున్న క్యాన్సర్ నిరోధక, డయాబెటిక్ నిరోధక ఔషధాల తోపాటు పలు ఇతర ఔషధాలను పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు.

ఐర్లాండ్, టర్కీ, అమెరికా, బంగ్లాదేశ్ సహా వివిధ దేశాల్లో తయారైనట్టుగా వాటిపై ముద్రించి ఉంది. కానీ, భారత్ లోకి చట్టబద్ధంగా అవి దిగుమతి అయినట్టు నిరూపించేలా ధ్రువీకరించే ఎలాంటి పత్రాలూ లేవు. అవసరమైన పత్రాలు లేని ఈ ఔషధాలను నకిలీవిగా భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో కొన్ని ఖాళీ ప్యాకింగ్ వస్తువులు కూడా దర్యాప్తు బృందానికి లభించడం.. స్వాధీనం చేసుకున్న ఈ ఉత్పత్తుల ప్రామాణికతపై మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

స్వాధీనం చేసుకున్న ఔషధాల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ. 6.60 కోట్లుగా ఉంటుందని అంచనా. సరైన పరిశోధన కోసం, ఔషధాల నమూనాలను నాణ్యత పరీక్షలకు పంపారు. స్వాధీనం చేసుకున్న మిగతా సరుకును సీడీఎస్సీవో భద్రపరిచింది. దర్యాప్తులో భాగంగా నిందితులను అరెస్టు చేశారు. ఓ మహిళను హోల్ సేల్ సంస్థ యజమానిగా గుర్తించారు. తూర్పు జోన్ సీడీఎస్సీవో డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ ఆమెను అదుపులోకి తీసుకున్నారు. నిందితులకు 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధించిన న్యాయస్థానం.. తదుపరి విచారణకు అనుమతించింది. ఈ విషయమై తదుపరి విచారణ కొనసాగుతోంది.

ప్రజల భద్రత, శ్రేయస్సు కోసం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది. నకిలీ, నాసిరకం ఔషధాలను మార్కెట్లో చెలామణీ చేయడాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదనడానికి.. ఈ స్వాధీనమూ, కొనసాగుతున్న విచారణా నిదర్శనాలు. నకిలీ ఔషధాల వల్ల పొంచి ఉన్న ముప్పును ఎదుర్కోవడానికీ, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికీ సీడీఎస్సీవో, రాష్ట్ర అధికారులు ఇక మీదట కూడా సమన్వయంతో పని చేస్తారు.

దృఢత్వంతో, నవకల్పనలతో ప్రపంచ స్థాయి ఆర్థిక నేతగా ఎదుగుతున్న భారత్: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 2:ఆటుపోట్లకు తట్టుకొని నిలిచే తత్వంతోనూ, నవకల్పనలతోనూ భారతదేశం ప్రపంచ స్థాయిలో ఆర్థికంగా నేతృత్వం వహించగల దేశంగా ఎదుగుతోందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు అన్నారు.

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) ఒక సందేశాన్ని పొందుపరుస్తూ, అందులో ఇలా తెలిపింది:

“భారతదేశం ఆటుపోట్లకు తట్టుకొని నిలిచే తత్వంతో, నవకల్పనలతో ఆర్థికంగా ప్రపంచ స్థాయిలో నేతృత్వం వహించగల దేశంగా ఎదుగుతున్నది. భారత్ పరిపాలనకు సరికొత్త నిర్వచనాన్నిచ్చింది. సామాజికంగా పురోగతిపథంలో ముందంజ వేస్తూ, డిజిటల్ మార్పులకు సారథ్యం వహించింది. ఈ ప్రయత్నాలన్నీ కలిసి అందరికీ అవకాశాలు లభించగల, అందరూ వృద్ధిలోకి రాగల భవిష్యత్తుకు రూపురేఖల్ని ఏర్పరుస్తున్నాయి”.

నజఫ్‌గఢ్‌లోని రోషన్‌పురలో వీర్ సావర్కర్ కళాశాలకు శంకుస్థాపన చేయనున్న పీఎం

న్యూఢిల్లీ, జనవరి 2:‘అందరికీ ఇళ్లు’ అనే తన ఆలోచనకు అనుగుణంగా ఢిల్లీలోని అశోక్ విహార్‌లో నిర్మించిన స్వాభిమాన్ గృహసముదాయాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సందర్శిస్తారు. యథాస్థానంలో మురికివాడ పునరావాస ప్రాజెక్టులో భాగంగా జుగ్గీ జోప్రి (జేజే) క్లస్టర్ల నివాసితుల కోసం వీటిని నిర్మించారు. జనవరి 3, 2025న దాదాపుగా మధ్యాహ్నం 12.10 గంటలకు వీటిని ప్రధాని సందర్శిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12.45 గంటలకు ఢిల్లీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు.

జేజే క్లస్టర్ల నివాసితుల కోసం ఢిల్లీలోని అశోక్ విహార్‌లో నూతనంగా నిర్మించిన స్వాభిమాన్ గృహసముదాయంలో 1,675 ఫ్లాట్లను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను అందజేస్తారు. కొత్తగా నిర్మించిన ఈ ఫ్లాట్లు, యథాస్థానంలో మురికివాడ పునరావాస ప్రాజెక్టులో భాగంగా ఢిల్లీ అభివృద్ధి సంస్థ (డీడీఏ) విజయవంతంగా పూర్తి చేసిన రెండో దశ ఇది. ఢిల్లీలోని జేజే క్లస్టర్ల నివాసితులకు అన్ని వసతులు, సౌకర్యాలతో కూడిన ఆరోగ్యకరమైన నివాస వాతావరణాన్ని కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.

ప్రతి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఖర్చు చేసిన ప్రతి రూ.25 లక్షల మొత్తంపై లబ్ధిదారులు 7 శాతం తక్కువ చెల్లిస్తారు. దీనిలోనే రూ.1.42 లక్షల నామమాత్రపు చెల్లింపుతో పాటు ఐదేళ్ల నిర్వహణ నిమిత్తం రూ. 30,000 భాగంగా ఉన్నాయి.

రెండు పట్టణ పునరాభివృద్ధి ప్రాజెక్టులు – నౌరోజీ నగర్లో నిర్మించిన అంతర్జాతీయ వ్యాపార కేంద్రం (డబ్ల్యూటీసీ), సరోజినీ నగర్‌లోని జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జీపీఆర్ఏ) టైప్ – ఎఐ క్వార్టర్లను ప్రధానమంత్రి ప్రారంబిస్తారు.

నౌరోజీ నగర్లో శిథిలావస్థలో ఉన్న 600 క్వార్టర్లను తొలగించి అత్యాధునిక వసతులతో కూడిన వాణిజ్య టవర్లతో అంతర్జాతీయ వ్యాపార కేంద్రాన్ని నిర్మించారు. తద్వారా 34 లక్షల చదరపు గజాల విస్తీర్ణంలో అధునాతన వసతులతో వాణిజ్య స్థలం అందుబాటులోకి వచ్చింది. సున్నా వ్యర్థాల విధానం, సౌర విద్యుత్ ఉత్పత్తి, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థల వంటి హరిత భవన నిర్మాణ పద్ధతులతో ఈ ప్రాజెక్టును నిర్మించారు.

సరోజినీ నగర్‌లోని జీపీఆర్ఏ టైప్ – ఎఐ క్వార్టర్లలో 28 టవర్లు నిర్మించారు. వీటిలో స్థలాన్ని సమర్థంగా ఉపయోగించి, ఆధునిక వసతులతో నిర్మించిన 2,500 నివాస యూనిట్లు ఉన్నాయి. వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ, మురుగు నీటి పారుదల, నీటి శుద్ధి వ్యవస్థలు, సౌరవిద్యుత్ ఆధారిత వ్యర్థ నిర్వహణ యంత్రాలు తదితర పర్యావరణ జీవన విధానాన్ని ప్రోత్సహించే పద్ధతులను ఈ ప్రాజెక్టులో భాగం చేశారు.

ఢిల్లీలోని ద్వారకలో సుమారుగా రూ. 300 కోట్ల రూపాయలతో నిర్మించిన సీబీఎస్ఈ సమీకృత కార్యాలయ సముదాయాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. దీనిలో కార్యాలయాలు, ఆడిటోరియం, అధునాతన సమాచార కేంద్రం, సమగ్ర నీటి నిర్వహణ వ్యవస్థ తదితరమైని ఉన్నాయి.



వడ్డీ కాసుల వాడికి రూ 1365 కోట్ల ఆదాయం

-ఏడాదికాలంలో హుండీ ద్వారా భక్తుల కానుకలు
-ఇక 2.55 కోట్ల మందికి గత ఏడాది స్వామి వారి దర్శన భాగ్యం
-99 లక్షల మంది తలనీలాలు సమర్పణ
-6.30 కోట్ల మంది అన్నప్రసాద స్వీకరణ

తిరుపతి,జనవరి 2:వడ్డీ కాసుల వాడికి గత ఏడాది భక్తులు దండిగానే కానుకలు సమర్పించారు.. తిరుమల శ్రీవారికి హుండీ ద్వారా గతేడాది రూ.1,365 కోట్ల ఆదాయం సమకూరింది. మొత్తం 2024 లో 2.55 కోట్ల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఇక 99 లక్షల మంది తలనీలాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఏడాది మొత్తంలో 12.14 కోట్ల లడ్డూలు కొనుగోలు చేశారు. ఇక టీటీడీ ఆధ్వర్యంలోని వివిధ సత్రాలలో, అన్నప్రసాద భవనంలో మొత్తం 6.30 కోట్ల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ వివరాలను నేడు టిటిడి విడుదల చేసింది.

కారు హారన్ మోగించడంపై ఘర్షణ.. పలు షాపులు, వాహనాలకు నిప్పు

ముంబై, జనవరి 2: కారు హారన్ మోగించడంపై రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో అల్లర్లు చెలరేగాయి. పలు షాపులు, వాహనాలకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో కర్ఫ్యూ విధించారు. ఈ ఘర్షణకు సంబంధించి ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

న్యూ ఇయర్ సందర్భంగా పలాధి గ్రామంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రి కారు డ్రైవర్ హారన్ మోగించి దారి ఇవ్వాలని కోరాడు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం తీవ్రమై ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో పలు షాపులతోపాటు వాహనాలకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు.

కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకున్నారు. అదనపు పోలీస్ సిబ్బంది, స్టేట్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌తోపాటు అల్లర్ల నియంత్రణ బృందాలను మోహరించారు. ఆ ప్రాంతంలో మూడు రోజులపాటు కర్ఫ్యూ విధించారు. ఈ ఘర్షణలకు సంబంధించి 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు.

మరోవైపు మంత్రి గులాబ్‌రావ్ పాటిల్ కాన్వాయ్‌లోని కారు డ్రైవర్ హారన్ మోగించడం ఈ ఘర్షణకు కారణమని మహారాష్ట్రలోని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ గొడవకు ఆ మంత్రి బాధ్యత వహించాలని, ఈ సంఘటనపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశాయి.

అన్నదానం.. మహాదానం.. ఎమ్మెల్యే ధనపాల్

నిజామాబాద్, జనవరి 2:: అన్ని దానాల్లో కంటే అన్నదానం మహాదానమని అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ అన్నారు. శబరిమలలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఇందూరు అయ్యప్ప స్వాముల సహకారం అందించడం అభినందనీయమని కొనియాడారు. భాగ్యనగర్ అయ్యప్ప సేవ సమితి ఇందూర్ నగర శాఖ ఆధ్వర్యంలో శబరిమలలో నిర్వహించే అన్నదానానికి సంబంధించిన సామాగ్రి వాహనం నాందేవాడ ఛత్రపతి హనుమాన్ ఆలయం నుండి శబరికి బయలుదేరుతున్న వాహనాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ?. భాగ్యనగర్ అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో శబరిమల నిలకల్ ప్రాంతంలో జనవరి 7తేదీ నుండి 14తేదీ వరకు నిర్వహించే మహా అన్నదాన కార్యక్రమానికి ఇందూర్ నగర శాఖ ఆధ్వర్యంలో 101క్వింటాళ్ల బియ్యం, పప్పుదినుసులు, నూనె, మొత్తం దాదాపు రూ.9లక్షల విలువైన వంట సామాగ్రి వాహనాన్ని శబరికి పంపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ రెడ్డి, ఆగమయ్య గురుస్వామి, గంగరత్నం గురుస్వామి, రవిస్వామి, పార్శి రాజు స్వామి, శ్రీనివాస్ స్వామి, పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యంగబద్ధంగా రావాల్సిన హక్కులను కల్పించాలి : ఆర్.కృష్ణయ్య

కాచిగూడ,జనవరి 2: బీసీలకు బిక్షం వద్దు, రాజ్యంగబద్ధంగా రావాల్సిన హక్కులను కల్పించాలని, బీసీల ఉద్యమాలు రాజ్యాధికారం దిశగా పయనించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల నియామకాల్లో 50 శాతం పోస్టులను బీసీ అధికారులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ ఉద్యోగులకు తక్షణమే పదోన్నతులను కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో 73 వేల మంది ఉద్యోగులు ఉన్నారని, అందులో 50 వేల మంది బీసీ ఉద్యోగులే ఉన్నారని, అయినప్పటికి బీసీ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

ఏ వర్గానికి లేని విధంగా బీసీ ఉద్యోగులకు క్రిమిలేయర్ విధానాన్ని రుద్దడం హేమమైన చర్య అని ఆరోపించారు. 19వ విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శులు కె.కుమారస్వామి, ముత్యం వెంకన్నగౌడ్, రాష్ట్ర నాయకులు ప్రేమ్‌కుమార్, అశోక్‌కుమార్, డాక్టర్ చంద్రుడు, పి.యాదగిరి, శ్రీనివాస్, రాజేందర్, సదానందం, శివాజీ,విజమకుమార్, రవీందర్, శ్రీకాంత్, అశోక్, వీరన్న, నిఖిల్ పాల్గొన్నారు.

కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే సంపూర్ణ పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మన శరీరంలో ఒక్కో అవయవం ఒక్కో ముఖ్యమైన పనిని చేస్తాయి. అలాగే కిడ్నీలు కూడా తమ విధులను నిర్వహిస్తాయి. శరీరంలో ఎప్పటికప్పుడు పేరుకుపోయే వ్యర్థాలను కిడ్నీలు వడబోస్తాయి. మూత్రం ద్వారా వాటిని బయటకు పంపుతాయి. దీంతో మన శరీరంలో టాక్సిన్లు పేరుకుపోకుండా చూస్తాయి. దీని వల్ల మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవన విధానం, ఇతర కారణాల వల్ల కిడ్నీలు అనారోగ్యాల బారిన పడుతుంటాయి. దీంతో కిడ్నీ స్టోన్స్ లేదా కిడ్నీ వ్యాధులు వస్తుంటాయి. అయితే పలు రకాల ఆహారాలను తరచూ తింటే కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని పోషకాలు కలిగిన సంపూర్ణ పౌష్టికాహారాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా యాంటీ ఆక్సిడెంట్లు, సోడియం, పొటాషియం తక్కువగా ఉండే ఆహారాలను తినాలి. దీంతో కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. కిడ్నీ వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు.

క్రాన్ బెర్రీలు..

క్రాన్ బెర్రీలను తినడం వల్ల కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. క్రాన్ బెర్రీలలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. 100 గ్రాముల క్రాన్ బెర్రీలను తింటే సుమారుగా 14 మిల్లీగ్రాముల విటమిన్ సి లభిస్తుంది. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. కిడ్నీలపై పడే భారాన్ని తగ్గిస్తాయి. దీంతో కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కిడ్నీ వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. అలాగే ఆలివ్ ఆయిల్‌ను కూడా ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. 100 గ్రాముల ఆలివ్ నూనెను తీసుకుంటే సుమారుగా 884 క్యాలరీల శక్తి లభిస్తుంది. అలాగే 14 మిల్లీగ్రాముల విటమిన్ ఇ లభిస్తుంది. ఈ నూనెలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల కిడ్నీల ఆరోగ్యానికి దోహదపడతాయి. కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుతాయి.

సముద్రపు చేపలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కూడా కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. 100 గ్రాముల చేపలను తింటే సుమారుగా 2.3 గ్రాముల మేర ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, 526ఐయూ విటమిన్ డి, 3.2 మైక్రోగ్రాముల విటమిన్ బి12 లభిస్తాయి. దీంతో శరీరంలోని వాపులు తగ్గుతాయి. బీపీ నియంత్రణలోకి వస్తుంది. కిడ్నీలపై పడే భారం తగ్గుతుంది. కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. అదేవిధంగా యాపిల్స్‌ను ఆహారంలో భాగం చేసుకున్నా కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. 100 గ్రాముల యాపిల్స్‌ను తింటే సుమారుగా 2.4 గ్రాముల మేర ఫైబర్ లభిస్తుంది. 4.6 మిల్లీగ్రాముల మేర విటమిన్ సి లభిస్తుంది. యాపిల్ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి షుగర్ లెవల్స్‌ను నియంత్రిస్తాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. దీంతో కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి.

వెల్లుల్లిలో సోడియం చాలా తక్కువగా ఉంటుంది. కనుక కిడ్నీలను ఇది ఆరోగ్యంగా ఉంచుతుంది. 100 గ్రాముల వెల్లుల్లిలో 31.2 మిల్లీగ్రాముల విటమిన్ సి, 1.7 మిల్లీగ్రాముల మాంగనీస్ ఉంటాయి. వెల్లుల్లిలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయం చేస్తాయి. బ్లూబెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. అలాగే 100 గ్రాముల బ్లూబెర్రీల్లో 9.7 మిల్లీగ్రాముల విటమిన్ సి, 2.4 గ్రాముల ఫైబర్ ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే శరీరంలోని వాపులు, ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతాయి. దీని వల్ల కిడ్నీల పనితీరు మెరుగు పడుతుంది. ఇలా పలు రకాల ఆహారాలను తరచూ తీసుకోవడం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. కిడ్నీ వ్యాధులు రాకుండా ఉంటాయి.

సనాతన ధర్మ హృదయంలోనికి ఆధ్యాత్మిక ప్రయాణం

న్యూఢిల్లీ, జనవరి 2:ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొన్న ఈ సమయంలో నమ్మకం, చైతన్యమనే నూతన అధ్యాయానికి మహాకుంభనగర్లోని కేంద్రీయ ఆసుపత్రి నాంది పలికింది. మహాకుంభమేళా ఆరంభమవడానికి ముందు 'గంగ' అనే ఆడశిశువు జననం.. పవిత్ర నదుల స్వచ్ఛతా సారాన్ని తెలియజేస్తుంది. మరోవైపు నవజాత మగ శిశువు 'కుంభ్' జననం... ఈ రెండు జననాలు జీవన చక్రాన్ని, మహా కుంభ మేళా ఆశీర్వాదాలను తెలియజేస్తున్నాయి. మహాకుంభ్ అధికారికంగా ప్రారంభం కావడానికి ముందే ఈ ఆసుపత్రి కార్యకలాపాలు మొదలుపెట్టింది. ఇది ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ఏర్పాట్లలో కచ్చితత్వాన్ని తెలియజేస్తుంది. మానవ సంక్షేమానికి ప్రతిబింబంగా, సంప్రదాయం–ప్రగతి మేళవింపుగా మహాకుంభమేళా పవిత్రతను ఆధునిక వసతులతో కూడిన ఈ ఆసుపత్రి పరిరక్షిస్తుంది.

సనాతన ధర్మానికి వేలు శిఖరంగా భావించే ఈ కుంభమేళా 2025లో వైభవంగా ప్రారంభం కానుంది. "తీర్థయాత్రలకు రాజు" లేదా తీర్థరాజ్‌గా పిలిచే ప్రయాగరాజ్ నగరం – పౌరాణిక, ఆధ్యాత్మిక, చారిత్రక సమ్మిళితం. ఇదే ఈ నగరాన్ని సనాతన సంస్కృతిని నిత్యనూతన స్వరూపంగా నిలిపింది. గంగా, యమున, అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నదుల సంగమ ప్రాంతమైన ఈ పవిత్ర భూమి భగవంతుని ఆశీర్వాదాన్ని, మోక్షాన్ని కోరుకొనే లక్షల మందిని ఆకర్షించే ఆధ్యాత్మిక అయస్కాంతంగా పనిచేస్తుంది. భక్తి, ధ్యానం, ఆధ్యాత్మికతల త్రివేణిగా మహాకుంభమేళా అలౌకికమైన ప్రయాణంగా మారనుంది.

ప్రయాగరాజ్‌లోని ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఒకటైన బాబా లోక్‌నాథ్ మహాదేవ్ ఆలయం రద్దీగా ఉండే లోక్‌నాథ్ ప్రాంతంలో ఉంది. ఈ క్షేత్రంలో బాబా లోకనాథుడు కాశీ విశ్వనాథుని ప్రతిరూపంగా పూజలు అందుకొంటున్నారు. స్వయంభూగా వెలసిన ఈ శివలింగ ప్రస్తావన స్కంద పురాణంలో, మహాభారతంలో కనిపిస్తుంది. ఇది ఈ క్షేత్ర ప్రాచీనతను తెలియజేస్తుంది. బాబా లోకనాథ్ ఆశీర్వాదాలు ఇబ్బందులు తొలగిస్తాయని భక్తులు విశ్వసిస్తారు. ఈ ఆధ్యాత్మిక అనుభూతిని పొందేందుకు వేలాది మంది భక్తులు మహాకుంభమేళా సమయంలో ఈ ఆలయాన్ని సందర్శిస్తారు. మదన్ మోహన మాలవీయ లాంటి ప్రముఖులతో ఉన్న అనుబంధం కారణంగా ఈ ఆలయ సాంస్కృతిక వారసత్వం మరింత సుసంపన్నమైంది. శివరాత్రి సమయంలో జరిగే శివ బారాత్ ఊరేగింపు, హోలీ వేడుకలు ప్రయాగరాజ్ ఆధ్యాత్మిక పారవశ్యానికి ఉత్సాహాన్ని జోడించాయి. మహాకుంభమేళాకు ఈ నగరం సిద్ధమవుతున్న తరుణంలో బాబా లోకనాథ్ ఆలయం కచ్చితంగా భక్తులకు ప్రధాన కేంద్రంగా మారుతుంది.

పూజలు నిర్వహించడానికి, ధ్యానం చేయడానికి, జ్ఞానాన్ని పంచుకోవడానికి వచ్చే నాగ సన్యాసులు, సాధువులతో మహాకుంభమేళా ఆధ్యాత్మిక నగరంలో అఖాడా విభాగం భక్తి శ్రద్ధలతో నిండిపోతుంది. వారిలో మహంత్ శ్రవణ్ గిరి, మహంత్ తారా గిరి కథలు ప్రత్యేకమైన శోభతో ప్రతిధ్వనిస్తాయి. వారి పెంపుడు జంతువులు లాలి, సోమపై వారికున్న అనురాగం సనాతన ధర్మంలోని కరుణ సారాన్ని తెలియజేస్తుంది. అలాగే ప్రాణమున్న ప్రతి జీవీ గొప్పదే అన్న భావనను తెలియజేస్తుంది. ప్రాపంచిక బంధాలను తెంచుకున్న ఈ సాధువులు వారి పెంపుడు జంతువుల్లో అహింస, షరతులు లేని ప్రేమతో కూడిన కుటుంబ బంధాలను కనుగొన్నారు. ఇలాంటి కథనాలు సన్యాసుల కఠినమైన జీవన విధానాన్ని మానవీయ కోణంలో చూపిస్తాయి. అలాగే ఆధ్యాత్మికత, ఉనికికి సంబంధించిన ఆనందాలకు మధ్య సదృశ్యాన్ని ఏర్పరుస్తూ మహా కుంభమేళాలో సంఘటితత్వాన్ని తెలియజేస్తాయి.

ఝుసీ ప్రాంతంలోని మహర్షి దూర్వాస ఆశ్రమం కూడా ప్రయాగ్‌రాజ్ ఆధ్యాత్మికతకు అదనపు ఆకర్షణను జోడిస్తుంది. మహర్షి దూర్వాసునికి చెందిన ఈ నేల తపస్సు, మోక్షానికి సంబంధించిన కథలను తెలియజేస్తుంది. పరమశివుణ్ని మెప్పించేందుకు దూర్వాస మహర్షి కఠోర తపస్సు చేసి, విష్ణుమూర్తి సుదర్శన చక్రం నుంచి రక్షణ పొందారు. ఆ మహర్షి ప్రతిష్ఠించిన ఈ శివలింగం భక్తులకు అభయదానాన్ని ఇస్తుందని విశ్వసిస్తారు. మహాకుంభ సన్నాహకాల్లో భాగంగా ఈ ఆశ్రమాన్ని పునరుద్ధరించారు. ఎర్ర ఇసుకరాయి ద్వారాలతో పాటు మౌలిక వసతులను మెరుగుపరిచారు. ఫలితంగా ఈ క్షేత్ర ఆధ్యాత్మిక పారవశ్యంలో భక్తులు మునిగిపోతారు. ఈ ఆశ్రమం ప్రయాగరాజ్‌ను నిర్వచించే పురాణాలు, ఆధ్యాత్మికత మధ్య శాశ్వత బంధాన్ని గుర్తుచేస్తుంది.

ఆధ్యాత్మిక ప్రయాణం, రవాణా అద్భుతం, ఆర్థిక దృగ్విషయం, ప్రపంచ ఐక్యతకు నిదర్శనం – అనే నాలుగు విధాలుగా నిర్వహించుకొనే ఉత్సవంగా కుంభమేళాను వర్ణిస్తారు. కల్పవం అనే భావన వ్యక్తులను అస్థిరమైన డిజిటల్ ప్రపంచం నుంచి బయటకు తీసుకువచ్చి శాశ్వతమైన జీవిత సత్యాలను తెలియజేసే మహాకుంభ్ పరివర్తన శక్తిని తెలియజేస్తుంది. ఈ మహా కుంభం ఓ కార్యక్రమం కాదు.. అది జీవన విధానం, ఆధ్యాత్మిక భావనతో నిర్వహించే ఉత్సవం. సనాతన వైదిక హిందూమత విలువలను తెలియజేస్తూ, ధర్మం, వాణిజ్యంతో ముడిపడిన సన్యాసులు, సాధువుల సత్సంగంలో దీని ఆత్మ నిండి ఉంది.

సంగమంలోని పవిత్ర మట్టి 2025లో లక్షలాది మంది భక్తుల రాక కోసం ఎదురుచూస్తూ ఉంది. మరెక్కడా లేని విధంగా ఆధ్యాత్మిక ప్రయాణంగా మహాకుంభ్ నిలిచిపోనుంది. ఇది మన మూలాలతో తిరిగి అనుసంధానమయ్యేందుకు, నిత్యనూతనమైన సనాతన ధర్మ జ్ఞానాన్ని పొందేందుకు, ఐహిక సంబంధాలకు అతీతమైన వేడుకల్లో పాల్గొనేందుకు ఇదే ఆహ్వానం, బాబా లోకనాథ్ దివ్య ఆశీర్వాదాల నుంచి దూర్వాస మహర్షి పౌరాణిక వారసత్వం వరకు, సన్యాసుల మానవీయ బంధాల నుంచి, జీవితంలోని అద్భుతాల వరకు, విశ్వాసం, భక్తి, మహత్యానికి అతీతమైనదిగా మహాకుంభ్ నిలుస్తుంది.

సనత్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం : ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్, జనవరి 2: సనత్‌నగం నియోజకవర్గంలో గత దశాబ్ద కాలంగా రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేశామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభివృద్ధికి వేలాది కోట్ల నిధులు వెచ్చించి అన్ని విధాలుగా అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు. సనత్‌నగర్ డివిజన్ మార్కెట్ రోడ్డులోని శ్రీనివాస్ భవన్ నుంచి హిందూ పబ్లిక్ స్కూల్ వరకు రూ. 65 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తలసాని గురువారం శంకుస్థాపన చేశారు.

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గం పరిధిలో డ్రైనేజీ, మంచినీటి, విద్యుత్, రహదారుల వ్యవస్థలను ఆధునీకరించామని వెల్లడించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డితో పాటు జీహెచ్‌ఎంసీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ వాసుదేవరెడ్డి, ఏఎంవోహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, జలమండలి జీఎం హరిశంకర్, బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, దాడి ప్రవీణ్‌రెడ్డి, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పెరిగిన చలి...

-సిర్పూర్ - యు లో 7.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత
-ఉత్తరాది నుంచి శీతల గాలుల తాకిడి
-ఉదయం వేళ కమ్మేస్తున్న పొగమంచు
-వాహనదారులకు తప్పని ఇబ్బందులు

ఆదిలాబాద్, జనవరి 2:పది రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతలతో ఉపశమనం పొందిన అదిలాబాద్ జిల్లా ప్రజలు కనిష్ట ఉష్ణోగ్రతల నమోదుతో మళ్లీ అల్లాడిపోతున్నారు. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావంతో అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో ఉష్ణోగ్రతలు అంతకంతకూ పడిపోతున్నాయి. ఆదిలాబాద్, కొమరం భీమ్ జిల్లాల్లోని 10 మండలాల్లో గురువారం సింగిల్ డిజిట్ లోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలి తీవ్రతకు గజగజ వణికిపోతున్నారు. ప్రధాన రహదారులన్నీ దట్టమైన పొగమంచు కమ్మేయగా ప్రయాణికులు.. వాహన చోదకులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

చలి గుప్పిట్లో ఏజెన్సీ - సిర్పూర్- యు లో 7.3 డిగ్రీల నమోదు..

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని కొమురం భీం జిల్లా తిర్యానీ ,కెరమెరి, జై నూర్, నార్నూర్, సిర్పూర్ యు, వాంకిడి ఏజెన్సీ మండలాల్లో సింగిల్ డిజిట్ లోనే అత్యల్పోష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం సిర్పూర్ - యు లో 7.3 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, ఆదిలాబాద్ రూరల్ మండలం పిప్పల్ ధరి లో 8.4 డిగ్రీలు, తిర్యాని, బేలలో 8.9 , అర్లిటి, తాంసి, బోరజ్, తలమడుగు, బీంపూర్,ఆదిలాబాద్ అర్బన్, వాంకిడి, ఆసిఫాబాద్ మండలాల్లో 9.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

రోజురోజుకు కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్న నేపథ్యంలో శ్వాసకోశ సంబంధ వ్యాధులు, అస్తమా, దగ్గు చలి జ్వరం పట్టిపీడించే అవకాశం ఉంది. ఉదయం రాత్రి వేళల్లో ప్రయాణం చేయకూడదని, చలి బారి నుండి సుయ రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. కాగా మరో 15 రోజులపాటు చలి తీవ్రత ఇదేవిధంగా ఉంటుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

కొత్త ఏడాది వేళ వరుస ప్రమాదాలతో వణికిపోయిణ అగ్రరాజ్యం అమెరికా

న్యూ డిల్లీ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కొత్త ఏడాది వేళ వరుస ప్రమాదాలతో అగ్రరాజ్యం అమెరికా వణికిపోయింది. ఇప్పటికే న్యూ ఓవర్లీన్స్‌లో పికప్ ట్రక్ బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య 15కు చేరింది. ఈ ఘటన మరవకముందే మరో రెండు ఘటనలు చోటు చేసుకున్నాయి.

టెస్లా సైబర్ ట్రక్కు పేలుడు..

లాస్ వేగాస్ (ఒజీబ ఎవణజీబ)లో పేలుడు సంభవించింది. అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన ఇంటర్నేషనల్ హోటల్ వద్ద భారీ పేలుడు చోటు చేసుకుంది. హోటల్ వెలుపల ఉన్న టెస్లా సైబర్ ట్రక్కు కారులో ఈ పేలుడు (ఠబక్రీజీ అఎవతీబితీబీఇఎ ఎక్రీజీబబి) సంభవించింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. సుమారు ఏడుగురు గాయపడ్డారు. న్యూ ఓవర్లీన్స్‌లో ట్రక్ బీభత్సం సృష్టించిన గంటల వ్యవధిలోనే ఈపేలుడు సంభవించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ రెండు ఘటనలకు లింక్ ఉందని.. ఉగ్రవాద చర్యగా అనిపిస్తోందని టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ అనుమానం వ్యక్తం చేశారు.

న్యూయార్క్ నైట్ క్లబ్‌లో కాల్పులు..

ఇక బుధవారం రాత్రి న్యూయార్క్ నైట్ క్లబ్‌లో (ఔవలి జనీతీని నితిణప్త్రబిఇఃశ్రీబీఏ) కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. క్వీన్స్ కౌంటీకి చెందిన అమజురా నైట్‌క్లబ్‌లో చోటు చేసుకున్న ఈ కాల్పుల ఘటనలో 11 మంది గాయపడ్డారు. దీని వెనుక ఇద్దరు దుండుగులు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కొత్త ఏడాది వేళ వరుస ఘటనలతో అమెరికా ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

కేసీఆర్ మార్గంలో రేవంత్ రెడ్డి నడవక తప్పదు : ఎమ్మెల్యే వివేకానంద

హైదరాబాద్, జనవరి 2: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గంలోనే సీఎం రేవంత్ రెడ్డి నడవక తప్పదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద సూచించారు. మేడ్చల్, శామీర్‌పేట్ వరకు మెట్రో మార్గం పొడిగిస్తూ రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనతో అది రుజువైందని పేర్కొన్నారు. మెట్రో విషయంలోనే కాదని, జలవనరులు, విద్యుత్ శాఖలోనూ కేసీఆర్ చూపిన మార్గంలో ముందుకు వెళ్లాల్సిందేనని వివేకానంద స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేపీ వివేకానంద మాట్లాడారు.

మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రో మార్గం పొడిగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడం బీఆర్ఎస్ విజయమన్నారు. ఈ మార్గాల్లో పనులను మొదటి ప్రాధాన్యంగా పెట్టుకుని పూర్తి చేయాలన్నారు. ఇక మెట్రో పనులు ఎప్పటిలోపు పూర్తి చేస్తారో చెప్పాలని కేపీ డిమాండ్ చేశారు. రాయదుర్గం నుంచి శంషాబాద్‌కు ప్రారంభమైన మెట్రో పనులను రద్దు చేయడం సరికాదన్నారు. ఈ రూట్‌లో దాదాపు 10 లక్షల మంది ఐటీ ఉద్యోగులు తిరుగుతారని పేర్కొన్నారు. రాయదుర్గం ? ఎయిర్‌పోర్టు మెట్రో పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ శాస్త్రీయంగా అధ్యయనం చేసి పనులు ప్రారంభించిన మెట్రో రూట్‌ను రద్దు చేయొద్దని ప్రతి సందర్భంలో ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేసి ఏడాది కావొస్తున్నా.. ఇప్పటి వరకు తట్టెడు మట్టి కూడా తీయలేదని కేపీ వివేకానంద విమర్శించారు.

మామూళ్ల పంపకాల్లో తేడా.. ఇద్దరు సస్పెండ్

-కానిస్టేబుల్, హోంగార్డ్ మధ్య ఘర్షణ

హైదరాబాద్, జనవరి 2:సూర్యాపేట జిల్లాలో మామూళ్ల పంపకాల్లో తేడా రావడంతో పోలీసు కానిస్టేబుల్, హోంగార్డు మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ విషయం పోలీసు ఉన్నతాధికారులకు తెలియడంతో సంఘటనపై ఆరాతీశారు. అనంతరం పూర్తి వివరాలు తెలుసుకుని కానిస్టేబుల్, హోంగార్డుపై సస్పెన్షన్ వేటు వేశారు.

సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ పోలీసు స్టేషన్ పరిధిలో రూ.1500 మామూళ్ల కోసం కానిస్టేబుల్ రవి, హోంగార్డు శ్రీనివాస్ మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో ఇద్దరిని సస్పెండ్ చేశారు.

ఆటో బోల్తా పడి ఒకరు మృతి..9మందికి తీవ్ర గాయాలు

హైదరాబాద్, జనవరి 2: రంగారెడి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లాల్‌పహాడ్ నుంచి చౌదర్‌గూడ మండలం వెళుతున్న ఆటో తుమ్మలపల్లి గేటు వద్ద ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తుమ్మలపల్లి గ్రామానికి చెందిన జంగయ్య అనే వ్యక్తిపై ఆటో పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారందరిని చికిత్స నిమిత్తం స్థానికులు షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మెట్రో రైల్ కలను సాకారం చేస్తాం : ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి



హైదరాబాద్, జనవరి 2:శామీర్‌పేట వరకు మెట్రో రైల్ కలను సాకారం చేస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మెట్రో రైల్ సాధన సమితి నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిమాట్లాడుతూ.. ప్యారడైజ్ నుంచి మేడ్చల్, జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్‌పేట వైపు మెట్రో రైల్‌ను విస్తరించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నాటి సీఎం కేసీఆర్ ప్రజలకు మెరుగైన రవాణ సౌకర్యం కల్పించాలని మెట్రో రైల్ ప్రాజెక్ట్ కోసం ప్రణాళికలు రూపొందించారని అన్నారు.ప్రస్తుత ప్రభుత్వం మెట్రో రైల్ ఆమోదం తెలపడంతో పాటు ప్రథమ ప్రాధాన్యత క్రమంలో మొదలు పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెట్రో రైల్ సాధన సమితి నాయకులు సంపత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, అనిల్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా పథకానికి షరతులు దారుణం: ఎంఎల్‌సి కల్వంకుంట్ల

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);రైతు భరోసా పథకానికి షరతులు, నిబంధనలు విధిస్తూ సిఎం రేవంత్ రెడ్డి అన్నదాతకు సున్నం పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వంకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా పథకం అమలుకు నిబంధనలను పెట్టడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రైతులకు షరతులు విధించడమేంటని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ప్రభుత్వాన్ని అడుక్కోవాలా..? అని నిలదీశారు. ఎటువంటి నిబంధనలను విధించకుండా బేషరతుగా రైతులందరికీ రైతు భరోసా నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం ఎంఎల్‌సి కవిత నివాసంలో జరిగిన బోధన్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఎంఎల్‌సి కవిత మాట్లాడుతూ? రైతు భరోసా పథకానికి కూడా దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని అన్నారు. ఇప్పటికే ప్రజా పాలన దరఖాస్తుల పేరిట ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించారని గుర్తు చేశారు. ఇంకెన్ని దరఖాస్తులు తీసుకుంటారని అడిగారు. రైతులను వ్యవసాయం చేసుకోనిస్తారా లేదా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ తిప్పలు పెడుతారా..? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. కెసిఆర్ రైతాంగాన్ని కడుపులో పెట్టుకొని కాపాడుకున్నారని, కానీ ఈ కాంగ్రెస్ నాయకులు రైతాంగాన్ని కుదేలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు భరోసాకు షరతులు, నిబంధనలు పెట్టి పెట్టుబడి సాయాన్ని ఎగవేసే ప్రయత్నం చేస్తున్నారని ఎండగట్టారు. రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని అన్నారు.

తెలంగాణ హైకోర్టులో జడ్జిల నియామకానికి చర్యలు చేపట్టాలి : వినోద్ కుమార్

హైదరాబాద్, జనవరి 2:తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంటనే జోక్యం చేసుకుని పూర్తి స్థాయిలో జడ్జిట నియామకానికి చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. జడ్జిలు పూర్తి స్థాయిలో ఉంటేనే తెలంగాణకు న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు.

సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో హైకోర్టు ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపాను. 2019 డిసెంబర్ 31 నాడు తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు వచ్చింది. కేసీఆర్ హయాంలోనే మేము పార్లమెంట్‌లో ఒత్తిడి చేసిన ఫలితంగా హైకోర్టు జడ్జిల సంఖ్యను 42కు పెంచారు. తెలంగాణ హైకోర్టుకు 42 మంది జడ్జిలు ఉండాలని నిర్ణయం తీసుకున్నా.. ఎప్పుడూ 23 మందికి మించి భర్తీ చేయడం లేదు. తెలంగాణ జడ్జిల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన వారు ఎవ్వరూ లేరు. పూర్తి స్థాయిలో జడ్జిలను నియమిస్తే దళిత, గిరిజన వర్గాలకు కూడా న్యాయం జరుగుతుంది అని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

హైకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య నానాటికి పెరిగి పోతోంది.. జడ్జిలు పూర్తి స్థాయిలో ఉంటే తప్ప కేసులు తొందరగా పరిష్కారం కావు. సామాజిక న్యాయం న్యాయ వ్యవస్థలో కూడా పాటించాల్సిందే. వేరే రాష్ట్రాల నుంచి తెలంగాణ హైకోర్టులో నలుగురు జడ్జిలు ఉన్నారు. జడ్జిలు పూర్తి స్థాయిలో ఉంటేనే తెలంగాణకు కూడా న్యాయం జరుగుతుందన్నారు వినోద్ కుమార్.

శామీర్ పేటకు మెట్రో రైల్ ప్రాజెక్టు వస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదు. ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజల కష్టాలు పోవాలంటే నాగపూర్ తరహాలో జేబీఎస్ నుంచి శామీర్ పేట వరకు డబుల్ డెక్ ఫ్లై ఓవర్‌ను ఏర్పాటు చేయాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.

అదుపుతప్పి పల్టీలు కొట్టిన కారు.. మహిళ మృతి

మహబూబ్‌నగర్, జనవరి 2:నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద ముద్దునూరు వద్ద అతివేగంలో అదుపు తప్పి పల్టీలు కొట్టింది ఓ కారు. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న మహిళ లక్ష్మమ్మ(40) పై నుంచి పల్టీలు కొడుతూ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లక్ష్మమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. అటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇక ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

–రాష్ట్ర రైతాంగం మీద కాంగ్రెస్ ప్రభుత్వ విధి విధానాలు ఏంటో చెప్పాలి

– రైతు కూలీలకు కేటాయించిన నిధులు ఎక్కడకు వెళ్లాయి

–ఎల్లుండి జరిగే కేబినెట్ భేటీలో రైతు భరోసాపై సరైన నిర్ణయం తీసుకోవాలి

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కాంగ్రెస్ ప్రభుత్వంలో కొన్ని వేల కోట్ల కుంభకోణాలు జరిగాయని.. వాటిని త్వరలో బయట పెడతామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఇందులో మంత్రులు ఎవరెవరు ఇన్వాల్ అయ్యారో ఆధారాలతో సహా చెబుతామని షాకింగ్ కామెంట్స్ చేశారు.

ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూస్తామని అన్నారు. రేవంత్ రెడ్డీ సినిమా డైలాగ్‌లకు మాత్రమే పరిమితమయ్యారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిందని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధుపై తన విధి విధానాలు ఏందో చెప్పిందని అన్నారు. రాష్ట్ర రైతాంగం మీద కాంగ్రెస్ ప్రభుత్వ విధి విధానాలు ఏంటో చెప్పాలని డిమాండ్ చ్జేసారు.. రైతు సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫల అయిందని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు.రైతు బంధును రైతు భరోసాగా పేరు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏం లేదని ఆరోపించారు. గురువారం బీజేపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.... గడిచిన ఏడాది అంత కాంగ్రెస్ వోసాల సంవత్సరమని విమర్శించారు. కొత్త ఏడాదిలో అయినా కాంగ్రెస్ ప్రభుత్వం మంచి బుద్ధి అలవరచుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం ఇచ్చిన మొదటి హామీ రైతు రుణమాఫీ అని చెప్పారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క లేనిపోని గొప్పలు చెబుతున్నారని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎద్దేవా చేశారు.రైతు కూలీలకు కేటాయించిన నిధులు ఎక్కడకు వెళ్లాయని ప్రశ్నించారు. 15లక్షల మంది ఉన్నట్లు రెవెన్యూ మంత్రి లెక్కలు చెప్పి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రూ. 9వేల కోట్లను డిసెంబర్ 28వ తేదీలోగా రైతుల ఖాతాల్లో వేస్తామని చెప్పి సబ్ కమిటీ ఏర్పాటు చేశారని అన్నారు. ఇందుకోసం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు , పొంగులేటి శ్రీనివాసరెడ్డితో సబ్ కమిటీ ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కమిటీ నివేదికను ప్రభుత్వానికి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఎల్లుండి జరిగే కేబినెట్ భేటీలో రైతు భరోసాపై సరైన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. రబీ అయిపొయింది.. ఖరీఫ్‌లో రైతులకు ఎలాంటి ప్రోత్సాహం ఇస్తారో కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.

గర్ల్స్ హాస్టల్ బాత్‌రూమ్‌లో సీక్రెట్ కెమెరా..

విద్యార్థినుల ఆందోళన

హైదరాబాద్, డిసెంబర్ జనవరి 2: మేడ్చల్‌లోని ఓ ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకున్నది. కాలేజీ గర్ల్స్ హాస్టల్ బాత్‌రూమ్‌లలో రహస్య కెమెరాలు అమర్చి వీడియోలు తీస్తున్నారని విద్యార్థినులు ఆందోళనకు దిగారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో పనిచేసే వంట సిబ్బందిపై అనుమానం వ్యక్తం చేశారు. వీడియోల ఘటనపై కాలేజీ యాజమన్యం వెంటనే స్పందించాలని నిరసన వ్యక్తం చేస్తున్నారు.

విషయం తెలుసుకున్న పోలీసులు కాలేజీ వద్దకు చేరుకున్నారు. అనుమానితుల వద్ద 11 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని విద్యార్థినులకు హామీ ఇచ్చారు. కాగా, విద్యార్థినుల ఆందోళనలతో వారి కుటుంబ సభ్యులు కాలేజీ వద్దకు చేరుకున్నారు. అయితే వారిని కళాశాల సిబ్బంది హాస్టల్‌లోకి అనుమతించకపోవడంతో ఉద్రిక్తత నెలకొన్నది. దీంతో విద్యార్థి సంఘాల నేతలు హాస్టల్ గేటు దూకి.. తాళాన్ని పగులగొట్టి చొచ్చుకెళ్లారు.

కాగా, కాలేజీలో ఘటనపై తమకు ఫిర్యాదు అందిందని, హాస్టల్ గదిలోని ఒక బాత్‌రూం వద్ద కిటికీలో నుంచి ఒక దుండగుడు తొంగి చూశాడని ఫిర్యాదులో పేర్కొన్నారని ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్ టీం కిటికీపై ఉన్న ఫింగర్ ప్రింట్స్‌ను సేకరించిందన్నారు. మెస్‌లో పనిచేసే ఐదుగురిపై విద్యార్థినులు అనుమానం వ్యక్తం చేశారని, వీడియోలు రికార్డు చేసి ఉంటే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మొత్తం 11 ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వాటిని పరిశీలిస్తున్నామని తెలిపారు.

గద్దె దింపేదాక పోరాటం సాగిద్దాం : కేటీఆర్

హైదరాబాద్, జనవరి 2:కాంగ్రెస్ పార్టీ తుగ్లక్ విధానాలపైన, నిరంకుశ పాలనపైన, హామీలను ఎగవేసిన మోసపూరిత ప్రభుత్వ తీరుపైన మన పోరాటం కొనసాగిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. పోయిన ఏడాది పాటు కాంగ్రెస్ పార్టీ పరిపాలన వైఫల్యాలను ఎండగట్టిన పార్టీ శ్రేణులకు ఒక సందేశం ఇచ్చారు. ప్రాణ సమానులైన? మన బీఆర్ఎస్ తోబుట్టువుల్లారా.. అంటూ ప్రారంభించిన కేటీఆర్, గత ఏడాది పాట చేసిన పోరాటాలను నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తూనే రానున్న రోజుల్లోనూ కాంగ్రెస్ మోసపూరిత ప్రభుత్వాన్ని గద్దెధించేదాకా పోరాటం సాగిద్దామని పిలుపునిచ్చారు.

గత ఏడాది కాలంగా ఈ కాంగ్రెస్ నిరంకుశ పాలనపై గులాబీ సైనికులందరూ కనబరిచిన పోరాట స్ఫూర్తికి పేరుపేరునా ప్రతి ఒక్కరికి శిరస్సువంచి సలాం చేస్తున్నా. గెలుపు ఓటములతో నిమిత్తం లేకుండా.. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు కనబరిచిన కదనోత్సాహం.. రాష్ట్ర స్థాయిలో పని చేసే నాయకత్వంలో కూడా మాటలకందని స్థాయిలో కొండంత స్ఫూర్తి నింపిందని కేటీఆర్ పేర్కొన్నారు.

గ్యారెంటీల గారడీని ప్రజాక్షేత్రంలో ఎండగట్టారు.. తెలంగాణ గ్రామ గ్రామాన ఉన్న.. గులాబీ సైనికులు రాష్ట్ర ప్రజలపక్షాన.. విరామం ఎరుగని పోరాటం చేస్తున్నారనీ, అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన ఈ తుగ్లక్ పాలన వల్ల కష్టకాలంలో ఉన్న అన్ని వర్గాల పక్షాన అలుపులేని పోరాటం చేశారని అభినందించారు. ఏడాది కాలంలో పార్టీ శ్రేణులు రైతుల పక్షాన మీరు పోరాడారు, నేతన్నల గొంతుకై మీరు నిలిచారు, మహిళా సమస్యలపై మీరు గర్జించారు, బడుగు బలహీనవర్గాల ప్రజల గళమయ్యారు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల పక్షాన సమరభేరి మోగించారు.. నిరుద్యోగుల హక్కుల కోసం కాంగ్రెస్ సర్కారును నిలదీశారు.. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీల గారడీని ప్రజాక్షేత్రంలో ఎండగట్టారని కేటీఆర్ తెలిపారు.

బీఆర్ఎస్ శ్రేణులు మోగించిన జంగ్ సైరన్‌తో ముఖ్యమంత్రికి ముచ్చెమటలు

'మూసీలో మూటల వేట' నుంచి 'లగచర్ల లడాయి' వరకూ.. అన్యాయం జరిగిన ప్రతిచోటా బాధితుల పక్షాన మీరు కొట్లాడారనీ, తెలంగాణ ప్రజల గుండెచప్పుడును అడుగడుగునా మీరు ప్రతిధ్వనింపజేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు పార్టీ చేసిన పోరాటాలు.. చరిత్రపై చెరగని సంతకాలుగా నిలుస్తాయన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను, అత్యంత సమర్థంగా తిప్పికొట్టిన సందర్భాలు.. ఈ పోరాటపథంలో నిలిచి ఉండే మైలురాళ్లు మారాయి అని అన్నారు. తెలంగాణ ప్రజల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా.. అసమర్థ, అనాలోచిత కాంగ్రెస్ విధానాలపై.. బీఆర్ఎస్ శ్రేణులు మోగించిన జంగ్ సైరన్ ముఖ్యమంత్రికి ముచ్చెమటలు పట్టించిందని కేటీఆర్ పేర్కొన్నారు.

మొక్కవోని ధైర్యంతో పార్టీ శ్రేణులు నిలబడ్డ తీరు అపూర్వం..

భారత రాష్ట్ర సమితి చేసిన అలుపెరగని పోరాటాల వల్లే.. అదానీ ఆశజూపిన రూ. 100 కోట్లను ప్రభుత్వం వెనక్కి ఇవ్వాల్సి వచ్చిందన్న కేటీఆర్, లగచర్ల లడాయి.. యావత్ దేశం ముందు నియంతృత్వ కాంగ్రెస్‌ను దోషిగా నిలబెట్టిందన్నారు. ఏడాదికాలంగా ప్రభుత్వాన్ని నిలదీసే క్రమంలో నియంతృత్వ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అక్రమ కేసులు పెట్టినా.. ప్రభుత్వం ఎంత వేధించాలని చూసినా.. మొక్కవోని ధైర్యంతో పార్టీ శ్రేణులు నిలబడ్డ తీరు అపూర్వం, అసాధారణం, చారిత్రాత్మకం అని కేటీఆర్ ప్రశంసించారు.

గులాబీ సైనికులందరికీ? గుండెల నిండా..

దశాబ్దాలపాటు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను, కుక్కలు చింపిన విస్తరిలా మార్చే కాంగ్రెస్ కుట్రలను, అడుగడుగునా ప్రశ్నిద్దాం, నిలదీద్దామని పిలుపునిచ్చారు. మన పార్టీకి పునాది రాళ్లు, మన బీఆర్ఎస్‌కు మూలస్తంభాలు పార్టీ శ్రేణులు అని, మన గులాబీ జెండాకు.. వెన్నుముక మీరే అన్నారు. పార్టీ తరఫున నిలబడి.. కలబడే.. నేటి అలుపెరగని పోరాట యోధులే.. రేపటి తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై బీఆర్ఎస్ పక్షాన మెరిసే.. వజ్రాయుధాలుగా మారుతారని ఆకాంక్షించారు. ఏడాది పాటు అద్భుతమైన పోరాట పటిమ చూపిన గులాబీ సైనికులందరికీ? గుండెల నిండా? మరోసారి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

చెరువుల హద్దులను ఆక్రమిస్తే నోటీసులివ్వనక్కర్లేదు..

–ఖాజాగూడ కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, డిసెంబర్ జనవరి 2: ఖాజాగూడలోని భగీరథమ్మ చెరువు, తౌటోని కుంటల్లో మంగళవారం హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు సీరియస్ అయింది. మరోవైపు కూల్చివేతల బాధితులంతా హైడ్రా చర్యలను నిరసించారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం ఖాజాగూడ కూల్చివేతలపై ఓ ప్రకటన విడుదల చేశారు. తమ నివాసాల్లోకి వరదనీరు వస్తున్నదంటూ చెరువు ఆక్రమణలపై స్థానికుల ఫిర్యాదు మేరకు భగీరథమ్మచెరువు, తౌటోనికుంటలను రెండుసార్లు క్షేత్రస్థాయిలో హైడ్రా బృందం పర్యటించిందని రంగనాథ్ పేర్కొన్నారు.

ఆ తర్వాత గత నెల 28వ తేదీన బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో కమర్షియల్ షాప్ ఓనర్స్, రియల్ ఎస్టేట్ డెవలపర్స్, శిఖం పట్టాదార్లతో సమావేశమయ్యామని, అదే సమయంలో గూగుల్ మ్యాపులను చూపించి ఆక్రమణలపై వివరించామని తెలిపారు. ఎనిమిదేళ్ల కిందటే తౌటోనికుంటకు ఫైనల్ నోటిఫికేషన్, భగీరథమ్మ చెరువుకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల హద్దులను నిర్ధారించారని రంగనాథ్ తెలిపారు. నవంబర్‌లో భగీరథమ్మ చెరువులో భవన నిర్మాణ వ్యర్థాలను డంప్ చేస్తున్న కంపెనీ యజమానిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

అదేవిధంగా భగీరథమ్మ చెరువు, తౌటోనికుంటల బఫర్‌జోన్‌లో ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని హైడ్రా కార్యాలయంలో జరిగిన మీటింగ్‌లోనే నాలుగైదురోజుల్లో ఖాళీ చేయాలని హెచ్చరించినా వారు ఖాళీ చేయకపోవడంతో డిసెంబర్ 30వ తేదీన నోటీసులిచ్చి 31న కూల్చేశామని తెలిపారు. వాటర్‌బాడీస్‌ను ఆక్రమించిన వారికి ఎటువంటి నోటీసులివ్వకుండానే కూల్చేసే అధికారముంటుందంటూ మున్సిపల్ యాక్ట్, సుప్రీంకోర్టు తీర్పులు చెబుతున్నాయని రంగనాథ్ పేర్కొన్నారు. తౌతోనికుంట, భగీరథమ్మ చెరువుల ఆక్రమణలకు సంబంధించిన గూగుల్ చిత్రాలను పత్రికలకు విడుదల చేశారు.

ఒక్కడినే ప్రేమించిన ఇద్దరు అమ్మాయిలు..

లక్నో, జనవరి 2: ఇద్దరు అమ్మాయిలు ఒకే అబ్బాయిని ప్రేమించారు. ఆలస్యంగానైనా విషయం వారికి తెలిసింది. ఇంకేముంది నా లవర్‌ను వల్లో వేసుకుంటామా అంటూ జుట్లుజుట్లు పట్టుకుని కొట్టుకున్నారు. పిడిగుద్దులు గుద్దుకున్నారు. వారిని ఆపేందుకు స్నేహితులు ప్రయత్నించినా ఫలించలేదు. చివరికి పెద్దలు జోక్యం చేసుకుని అతి కష్టంమీద వారిద్దరిని విడిపించిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బాఘ్‌పట్ జిల్లా సరాయ్ ప్రాంతంలో జరిగింది.

సింఘౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని సరాయ్ ప్రాంతంలో ఉన్న ఓ స్కూల్‌కు చెందిన ఇద్దరు అమ్మాయిలు.. అదే పాఠశాలలో చదువుతున్న ఒకే అబ్బాయిని ప్రేమించారు. తామిద్దరం ఒక్కడినే ప్రేమిస్తున్నామని తెలుసుకున్న వారు.. స్కూల్ నుంచి ఇంటికి వెళ్తూ గొడవకు దిగారు. స్కూల్ యూనిఫామ్ ఉన్నామన్న విషయాన్ని మరికి ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. జట్లు పట్టుకుని కొట్టుకున్నారు. తోటి విద్యార్థినులు వారిని ఆపేందుకు ప్రయత్నించినా వారి తరం కాలేదు. దీంతో ఇదంతా చూస్తున్న స్థానికులు వారిని విడిపించారు. విషయం తెలుసుకుని నవ్వుకున్నారు. ఇదంతా అక్కడి ఓ షాప్‌లో ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. మంగళవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకున్నది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది.

కాగా, అమ్మాయిల గొడవపై సింఘౌలి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో స్పందిస్తూ.. ఇప్పటివరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. ఈ వీడియో ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, కారణం ఏంటో తెలుసుకుంటామని వెల్లడించారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

నారాయణపేట జిల్లాలో ట్రాక్టర్ బోల్తా.. 20 మంది కూలీలకు గాయాలు

హైదరాబాద్, జనవరి 2: ట్రాక్టర్ బోల్తా పడి వ్యవసాయ కూలీలకు గాయాలైన సంఘటన నారాయణపేటజిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిని వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ మండలం దాసరి దొడ్డి గ్రామానికి చెందిన ఐతు పొలంలో వరినాట్లు వేసేందుకు గురువారం ఉదయం ట్రాక్టర్‌లో 20 మందికిపైగా కూలీలు బయలుదేరారు. కొద్దిదూరం ప్రయణించగానే డ్రైవర్ అజాగ్రత్తతో ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో ఇరవై మందికి పైగా గాయపడ్డారు. గుర్తించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను మహబూబ్‌నగర్ వైద్యశాలకు తరలించారు. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తమిళనాడులో వెయ్యి కోట్ల సైబర్ మోసం..

పశ్చిమ బెంగాల్‌లో ఈడీ సోదాలు

కోల్‌కతా, జనవరి 2: తమిళనాడులో సుమారు వెయ్యి కోట్ల సైబర్ మోసం జరిగింది. అయితే ఆ కేసుకు సంబంధించిన తనిఖీలు పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు బెంగాల్‌లోని 8 ప్రదేశాల్లో సోదాలు చేపడుతున్నారు. కోల్‌కతాలో పార్క్ స్ట్రీట్, సాల్ట్ లేక్, బగుహతి ఏరియాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. మరో జిల్లాలోని మూడు ప్రదేశాల్లో సోదాలు చేపడుతున్నారు. సాల్ట్ లేక్ ఏరియాలో ఇవాళ జరిగిన తనిఖీల్లో.. ఈడీ అధికారులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. బగుహతి ఏరియాలో ఉన్న ఓ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో తనిఖీలు జరుగుతున్నట్లు ఈడీ అధికారి తెలిపారు. ఈశాన్య భారత్‌కు చెందిన పలు రాష్ట్రాల వ్యక్తులు ఈ క్రైంలో పాల్గొన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు

సహజీవనం చేస్తున్న మహిళతో గొడవ పడి వ్యక్తి ఆత్మహత్య

హైదరాబాద్, జనవరి 2: రోజంతా మద్యంతాగుతుండడంతో పాటు సహజీవనం చేస్తున్న మహిళతో గొడవపడిన ఓ వ్యక్తి ఆత్మహత్యకుపాల్పడ్డాడు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని కాకినాడ ప్రాంతానికి చెందిన ధర్మ(35) అనే వ్యక్తి సినిమా షూటింగ్స్‌లో ఆర్ట్ డిపార్ట్‌మెంట్స్‌లో పనిచేస్తుంటాడు. భార్యతో గొడవపడి వేరుగా ఉంటున్న ధర్మకు నాలుగేళ్ల క్రితం మల్లమ్మ(39) అనే మహిళతో పరిచయం ఏర్పడింది. అప్పటినుంచి వారిద్దరూ కలిసి ఇందిరానగర్‌లో గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు.

కాగా, బుధవారం నూతన సంవత్సరం కావడంతో ఫ్రెండ్స్‌తో రోజంతా మద్యం సేవించిన ధర్మ సాయంత్రం ఇంటికి వచ్చాడు. వచ్చిన తర్వాత రాత్రి ఏడున్నర ప్రాంతంలో మరోసారి మద్యం తెచ్చుకుని దూరపు బంధువయిన దుర్గ అనే వ్యక్తితో కూర్చుని తాగుతున్నాడు. అయితే రోజంతా తాగేసి వచ్చావు.. మళ్లీ ఎందుకు తాగుతున్నావంటూ మల్లమ్మ ప్రశ్నించింది. దాంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. అంతటితో ఆగకుండా మల్లమ్మకు వేరే వాళ్లతో సంబంధం ఉందంటూ ఆమెపై దాడి చేశాడు.

వీరిద్దరి గొడవ చూసిన దుర్గ అడ్డుకోగా అతడిపై కూడా చేయి చేసుకోవడంతో అక్కడినుంచి వెళ్లిపోయాడు. రాత్రి పదిన్నర ప్రాంతంలో మరోసారి మల్లమ్మపై దాడి చేయడంతో పాటు ఇంట్లోంచి బయటకు తరిమి వేశాడు. దీంతో అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఇంటినుంచి బయటకు వచ్చి సుమారు గంటసేపు ఆమె బయటనే కూర్చుంది. కోపం తగ్గి ఉండవచ్చునుకుని ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా తలుపులు వేసుకున్నట్లు తెలింది. తలుపు సందులో నుంచి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్న ధర్మ కనిపించాడు.

దీంతో గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా అప్పటికే ధర్మ మృతి చెందినట్లు తేలింది. ఈ మేరకు సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బెంగాల్‌లో చొరబాట్లకు కేంద్రం పాత్ర.. బంగ్లాదేశీయులను బీఎస్ఎఫ్ అనుమతిస్తోంది: మమతా బెనర్జీ

కోల్‌కతా, జనవరి 2: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ రాష్ట్రంలోకి చొరబాట్లకు కేంద్ర ప్రభుత్వం ముఖ్య పాత్ర పోషిస్తున్నదని విమర్శించారు. అందుకే బంగ్లాదేశీయుల చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతిస్తున్నదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానిది 'నీచమైన బ్లూప్రింట్' అని మండిపడ్డారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు బెంగాల్‌లో శాంతికి విఘాతం కలిగిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల ఆరోపించారు. అలాగే ఓటు బ్యాంకు కోసం బంగ్లాదేశీయులకు సంబంధిత పత్రాలను టీఎంసీ అందజేస్తున్నదని, వారి చొరబాట్లకు సహకరిస్తున్నదని బీజేపీ విమర్శించింది.

కాగా, గురువారం అధికారులతో సమావేశం సందర్భంగా సీఎం మమతా బెనర్జీ ఈ ఆరోపణలపై స్పందించారు. రాష్ట్రాన్ని అస్థిరపరిచేందుకు బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను కేంద్ర బలగాలు అనుమతిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రం 'నీచమైన బ్లూప్రింట్' అమలు చేస్తున్నదని విమర్శించారు. 'వివిధ ప్రాంతాల నుంచి బెంగాల్‌లోకి చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతిస్తోంది. మహిళలను చిత్రహింసలకు గురిచేస్తోంది. సరిహద్దులను టీఎంసీ కాపాడటం లేదు. సరిహద్దు మా చేతుల్లో లేదు. కాబట్టి చొరబాట్లను టీఎంసీ అనుమతించిందని ఎవరైనా ఆరోపిస్తే, అది బీఎస్ఎఫ్ బాధ్యత అని నేను ఎత్తి చూపుతా' అని అన్నారు.

మరోవైపు సరిహద్దులో చొరబాట్ల గురించి రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్రం వద్ద కూడా సమాచారం ఉందని మమతా బెనర్జీ తెలిపారు. డీజీపీ రాజీవ్ కుమార్‌తోపాటు స్థానిక వర్గాల నుంచి తనకు సమాచారం అందిందని చెప్పారు. దీని గురించి కేంద్రానికి ఘాటుగా లేఖ రాస్తానని అన్నారు. అలాగే చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతించే ప్రాంతాలను గుర్తించి దర్యాప్తు చేయాలని డీజీపీని ఆదేశిస్తానని స్పష్టం చేశారు.

కాగా, పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో శాంతి నెలకొనాలని ఆశిస్తున్నట్లు మమతా బెనర్జీ తెలిపారు. 'మాకు శత్రుత్వం లేదు. కానీ గూండాలను ఇక్కడకు అనుమతిస్తున్నారు. వారు నేరాలకు పాల్పడి సరిహద్దు దాటి తిరిగి వస్తున్నారు. ఈ చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతిస్తోంది. ఇందులో కేంద్రం పాత్ర కూడా ఉంది' అని అన్నారు. బెంగాల్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు ఆజ్యం పోసే ప్రయత్నం ఎవరైనా చేస్తే నిరసనలు తప్పవంటూ కేంద్రాన్ని హెచ్చరించారు.

బుక్ ఎక్జిబిషన్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, జనవరి 2:విజయవాడలో "35వ పుస్తక మహోత్సవం" పేరిట నిర్వహించి బుక్ ఎక్జిబిషన్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఇందిరా గాంధీ మున్సిపల్ ఇంటర్నే షనల్ స్టేడియంలో జరుతుగున్న ఈ బుక్ ఎక్జిబిషన్ 11 రోజుల పాటు (ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు) జరగనుంది.

గేదల కుంటను కాపాడండి

–బాబా జగ్జీవన్ రాం యువజన సంఘం నేతలు



హైదరాబాద్, జనవరి 2: బాలాపూర్‌లో ఉన్న చెరువులు, కుంటలను అధికార పార్టీకి చెందిన నాయకులు కబ్జా చేస్తున్నారని బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్, తిమ్మని గిరీశ్, నీరుడు శ్రీరాములు, పగడాల ఉమేశ్, సుధాకర్ ఆరోపించారు. బాలాపూర్ రెవెన్యూ పరిధిలో ఉన్న పురాతన గేదల కుంట కట్టను తొలగించి చెరువు ఆనవాళ్లు లేకుండా చుట్టు ప్రహరీ ఏర్పాటు చేశారని, చెరువును మట్టితో పూడ్చివేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల కబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. బాలాపూర్ రెవెన్యూ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

బాలాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ .74లో ఉన్న ప్రభుత్వ భూమిని అనుసరించి గేదల కుంట ఉందన్నారు. సర్వే నంబర్. 74లో ఉన్న ప్రభుత్వ భూమిని అధికారులు సర్వే చేసిన తర్వాత మూడు ఎకరాల భూమి ఉన్నదని నిర్ధారించారన్నారు. ప్రభుత్వ భూమి, చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ఆర్‌సీఐ ప్రధాన రహదారిని అనుసరించి గేదల కుంట ఉందన్నారు. రోడ్డు సైడ్ కనిపిస్తుందన్నారు. ఉద్దేశంతో రాత్రికి రాత్రి ప్రహరీ ఏర్పాటు చేశారని, తప్పుడు పత్రాలు సృష్టించారని తెలిపారు. ప్రహరీతో పాటు గేట్లు ఏర్పాటు చేశారన్నారు. అధికార పార్టీ అండతో దర్జాగా కబ్జాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. అధికారులు అధికార పార్టీ నాయకులకు భయపడి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గేదల కుంటను కాపాడే వరకు పోరాటం చేస్తామన్నారు.

బంగారం ధర పైపైకే.. రెండో రోజూ దూకుడే..

హైదరాబాద్, జనవరి 2:జ్యువెల్లర్లు, రిటైల్ వ్యాపారుల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించడంతో దేశీయ రాజధాని ఢిల్లీలో గురువారం తులం బంగారం (99.9 శాతం స్వచ్ఛత) ధర రూ.330 వృద్ధి చెంది రూ.79,720లకు చేరుకుంది. బుధవారం 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.79,390 వద్ద స్థిర పడింది. గురువారం కిలో వెండి ధర రూ.130 పెరిగి రూ.90,630లకు చేరుకున్నది. బుధవారం కిలో వెండి ధర రూ.90,500 పలికింది. ఇక 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.330 పెరిగి రూ.79,170 వద్ద నిలిచింది. బుధవారం ఇది రూ.78,840 వద్ద నిలిచింది.

మహిళా విద్య చైతన్య దీప్తి "సావిత్రి బాయ్ పూలే"



(సావిత్రి బాయ్ పూలే 194 వ జయంతి సందర్భంగా)

సాంఘిక 'సామాజిక'రాజకీయ రంగాల్లో నూతన ఉత్తేజానికి అభ్యుదయ రకరమైన ఆలోచనలకు విద్య ఆయుధం లాంటిది. మహిళా విద్య వ్యాప్తితో మహిళా హక్కుల రక్షణ ఉద్యమ ప్రధాతగా సావిత్రి బాయి పూలే చరిత్రలో చిరస్మరణీయులుగా నిలవడం గమనార్హం.

మొదటి మహిళా ఉపాధ్యాయురాలు -సావిత్రీ బాయి పూలే

సావిత్రిబాయిపూలే ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి చేసిన తొలి తరం మహిళా ఉద్యమకారిణి. స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన నాయకురాలు. గొప్పసంఘ సంస్కర్త' రచయిత్రి' స్త్రీ' పురుషులు కులమతాలకు అతీతంగా విద్యను అభ్యసించాలని విద్య సహజమైన హక్కుగా ఉంటుందని అందుకే అందరూ చదువుకోవాలని అందరూ సమానంగా బ్రతకాలని నిరంతరం తపించిన సామాజిక విప్లవ మాత్రుమూర్తి పూలే.

నాటి నేటికీ సమాజంలో సావిత్రిబాయి పూలే వ్యక్తిత్వం ప్రభావశీలమైంది.

సావిత్రిబాయి పూలే జననం

మహారాష్ట్రలోని సతారా జిల్లా నమ్ గావ్ లో 1831 జనవరి 3న సావిత్రిబాయిజన్మించింది. 1847 నాటికి భర్తతో కలిసి బాలికల కోసం పూనేలో మొదటి పాఠశాల ప్రారంభించింది. పాఠశాల నడపడం కొందరికి నచ్చలేదు.

ధైర్యం పట్టుదలకు నిదర్శనం - సావిత్రిబాయి పూలే



పాఠశాల నడపడంలోసావిత్రి బాయి అనేక ఇబ్బందులకు అవమానాలకు గురైంది. శూద్రుల విద్యాభివృధికొరకు ఆమె చేస్తున్న పని నచ్చలేదు. ఆమెపై భౌతిక దాడులు చేశారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం' రాళ్లు విసరడం అసభ్య పదజాలాన్ని వాడటం అనేక ఇబ్బందులకు గురి చేశారు.

బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తర్వాత మార్చుకొని మళ్ళీ తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు బురధ చీరకట్టుకొని వచ్చేది. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా నా విధిని నేను నిర్వహిస్తున్నాను అని చెప్పేది. పట్టు వీడక అవమానాలకు వెరువక

వారు సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ కాలంలోనే గుర్తింపు వచ్చింది. సమాజం నుంచి సహకారం లభించింది.

సమాజ భాగస్వామ్యం- విద్యాభివృద్ధి

విద్యాభివృద్ధి కొరకు సావిత్రిబాయి పూలే చేసిన కృషికి సమాజం నుండి దాతల నుండి సహకారం లభించింది. విద్యాభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని పెంచింది. విద్యాభివృద్ధి కొరకు మంచి ప్రోత్సహిం లభించింది. ఒకరు తమ ఇంటి ఆవరణను బడి కోసం ఇస్తే. కొంతమంది పుస్తకాలను సేకరించారు. మోరే విఠల్' వాల్వేకర్ ' దియోరావు వంటి ప్రముఖులు పాఠశాల నిర్వాహణకు సహకరించారు.

1851బాలికలపాఠశాల ప్రారంభించారు. బాలికల చదువు కోసం విద్యాభివృద్ధి కోసం సహకరించాలని చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ సమాజంలో చాలామంది సహకరించారు.

వేగుచుక్క -సావిత్రీ బాయి పూలే

సావిత్రిబాయి అన్ని వర్గాల మహిళలకు విద్యను అందించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు. మూఢనమ్మకాలు రాజ్యమే లుతున్న కాలంలో వేగుచుక్కలాగ ఉదయించిన సావిత్రిబాయి పూలే నిరంతర సామాజిక చైతన్యంతో మహిళా హక్కుల రక్షణ సాధికారిత ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు .

సావిత్రీ బాయిపూలే- విద్యా విప్లవ శక్తి

జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే సాంఘిక విద్యా విప్లవ శక్తి వీరి ద్వారా స్ఫూర్తి పొందిన అంబేద్కర్ భారత రాజ్యాంగంలో విద్యను ప్రాథమిక హక్కుగా చేర్చడం వల్ల సమాజంలో అన్ని వర్గాల వారికి విద్య అందుబాటులోకి వచ్చింది.

పూలే దంపతులు 1848 జనవరి 1న పూణేలోని బుధవార పేటలో బాలిక పాఠశాల స్థాపించి తొలి మహిళా ఉపాధ్యా యురాలిగా విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. సాంప్రదాయాలు అవమానాలు 'భీత్కారాలను స్త్రీలను బానిసలుగా చూసే పితృస్వామ్య 'ఫూడల్ వ్యవస్థ' ప్రగతి నిరోధక శక్తుల ను అడ్డుకొని విద్య సహజ హక్కని అందరు చదువాలని తపించిన సామాజిక విప్లవ మూర్తి సావిత్రి బాయ్ పూలే సంకల్పించిన కార్యదీక్షతో మొక్కవోని ధైర్యంతో శూద్రులకు అతి శూద్రులకు విద్యను అందించిన విద్యా ఉద్యమ ప్రదాత . గ్రామీణ ప్రాంతాలలో బాలికలకు52 పాఠశాలలు స్థాపించి మధ్యాహ్న భోజన వసతి కల్పించి మహిళ విద్య సామాజిక సంపదగా బావించారని విజ్ఞానం వికాసం సమాజానికి వెలుగు లాంటివని 'సావిత్రి బాయి పూలే చైతన్య శక్తిగా ప్రజాతంత్ర విద్యా విప్లవ ప్రదాతగా చరిత్రలో నిలవడం గమనార్హం.

మహిళా సంఘం స్థాపన

మహిళా సేవ మండల్ పేరిట మహిళా సంఘాన్ని 1852 లో స్థాపించారు. వితంతువుల పట్ల వివక్ష 'అక్రమ సంతానం పేరిట శిశువుల హత్యలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడిపారు. అనాధ బాలలు 'బాలికలు అందరూ తమ బిడ్డలేనని భావించారు. 1874లో ఒక వితంతు బిడ్డను పూలేదంపతులు దత్త పుత్రుడిగా స్వీకరించారు. అతనికి యశ్వంత్ అనే పేరు పెట్టి చదివించి డాక్టర్ ను చేశారు.

కులాంతర వివాహాలు

1873లో సత్యశోధక్ సమాజం మహిళావిభాగం పేరిట కులాంతర వివాహాలు జరిపించారు. భార్యని కోల్పోయిన ఒక యువకుడికి తన స్నేహితురాలి బిడ్డ తో పెళ్లి చేశారు. సావిత్రిబాయి భర్తతో పాటు తాను కూడా కష్టాల్ని అవమానాలు సహించింది. సావిత్రిబాయి ప్రపంచ చరిత్రలోనే భర్తతోపాటు ఉద్యమ జీవితంలో కలిసి నడిచిన ఆదర్శ సహచరిగా నిలిచిపోయింది. సావిత్రిబాయి తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి విద్యాబోధనకు బాలికల అభివృద్ధికి అంకితమైంది. సాంఘిక దురాచారాల నిర్మూలన కోసం పెద్దలతో ఘర్షణ పడిన సంఘటనలు అనేకంచోటుచేసుకున్నాయి.

ఆశ్రమాల ఏర్పాటు

అనాధ స్త్రీలకు పిల్లలకు ఆశ్రమాలు ఏర్పాటు చేశారు. సత్యశోధిక సమాజంలో మహిళ విభాగం ఏర్పాటు చేసే కులాంతర వితంతువుల వివాహాలను ప్రోత్సహించారు. 1890లో భర్త జ్యోతిరావు పూలే మరణిస్తేఅంత్యక్రియలు జరిపే సందర్భంలో బంధువులు' దత్తపుత్రులు ఘర్షణ పడుతుంటే తానే చితికినిప్పుఅంటించారు.ఆమె తెగువకు యావత్ భారత దేశంగ్రాంతి చెందింది.

సామాజిక ఉద్యమ కారిణి

సావిత్రి బాయిపూలే అంటరానితనం 'అస్పృశ్యత 'ఆడశిషువుల హత్య' నతి' బాల్య వివాహాలు 'వైధవ్యం వితంతువుల వివాహాలు' మూఢనమ్మకాలనురూపుమాపడానికిఉద్యమాలుచేశారు .అత్యాచార బాధితులకు ప్రత్యేక సంస్థ స్థాపించారు. కార్మిక స్త్రీల హక్కుల పోరాటం లో కీలక పాత్ర పోషించారు. వారి స్ఫూర్తితో మహిళా సంఘాలు యువజన సంఘాలు సమాజంలో ఉన్న లింగ వివక్షతను' వేతన వ్యత్యాసాలను కుల వివక్షతను రూపిమాపి కుల రహిత సమాజ స్థాపనకు చేసే కృషియే సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు నిజమైన కార్యాచరణ అని

మహిళా హక్కులే మానవ

హక్కులు అని తొలిసారి నినదించిన ధీశాలి సావిత్రి బాయ్ పూలేను మహిళా లోకం స్ఫూర్తిగా తీసుకొని మహిళావికాసానికిచైతన్యానికి మహిళా సంక్షేమానికి ఉద్యమించాలి . .

అగ్రవర్ణాల దురహంకారం నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ వేళ్లూనుకున్న సామాజిక అంతరాలు దురాచారాలను అంతం చేయడానికి చివరి వరకు పోరాడిన సావిత్రిబాయి పూలేను మహిళలు 'యువత విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి.

ప్రభుత్వాలకు- దిశ దశ కావాలి

స్వేచ్ఛ సమానత్వం 'సౌభ్రాతృత్వం మహిళా విద్య మహిళా హక్కులు రక్షణ అందరికీ ఉచితంగా ఉన్నత విద్య ఇవ్వాలని సావిత్రి బాయ్ చేసిన భోధనలు ప్రభుత్వాలకు నూతన దిశ దశ కావాలి . దేశ జనాభాలో 50 శాతం వున్న మహిళలకు విద్య అందించి లింగ వివక్షతను స్త్రీ పురుష అసమానతలు అంతం చేయటానికి విద్య ఆయుధం లాంటిదని బాలికలకు మహిళకు ఉచిత విద్య వృత్తి విద్య అందించి

మహిళలో ఆర్థిక స్వశక్తి సాధికారిత సాధన కు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చెయ్యాలి.

ప్లేగు వ్యాధి సావిత్రి బాయి మరణం

1890లో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలను నిర్వహిస్తూ దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2000 మందికి పిల్లలకు భోజనాలు పెట్టించిన సావిత్రిబాయి పూలే 1897 న సంవత్సరం మార్చి 10 ఒక పిల్లవాడికి సేవ చేస్తుండగా ఆమెకు ప్లేగు వ్యాధి సోకి మరణించింది.

విద్య సహజ హక్కుఅని సమాజంలో అన్ని వర్గాలకు విద్య అందాలని సామాజిక అభివృద్ధిలో విద్య ప్రామాణికతను గుర్తించిన సావిత్రి బాయ్ పూలే ఆశయాల సాధనకు ప్రభుత్వాలు విద్యా విధానాన్ని అమలు చేయాలి.

ప్రభుత్వాలు బహుజనులకు ఉచిత విద్య అందించి సామాజిక ఉన్నతికి పాటుపడాలి.

-నేదునూరి కనకయ్య
9440245771

- వివక్షల సరిహద్దులో అక్షర యోధురాలు సావిత్రీ బాయి పూలే -

ప్రతిరోజూ ఉదయించే...
సూర్యుడు చీకట్లోంచి బయటకు రావడానికి పన్నెండు గంటలు పడుతుంది
కానీ, ఒక ఆశాస్వప్నం అక్షరం
తలతత్తల కోసం తెల్లవారు జామునే మేల్కొంటుంది!
ఒక అక్షరం కాలగర్భం నుంచి...
కొన్ని తరాల ప్రసవ వేదనలతో పెనుగులాడి, నొప్పులు పడి, ఆనంద విషాదాశ్రువుల పెడబొబ్బలతో పరితపించి, శపించి భారత హైందవ గడ్డ మీద విరుచుకు పడిన ఒక మాయాక్షరి
ఈ భూమ్మీద పడిన రోజు... ఈ రోజు!
దశాబ్దాలు శతాబ్దాలుగా, శతాబ్దాలు తరాలుగా ఎన్నో వివక్షల అంతరాలని, అవాంతరాలని దాటుకుని
ఒక అక్షరం పూనే వెలివాడల్లో వెలసిన రోజు.... ఈ రోజు!
అక్షరాన్ని ఒడిలో కూర్చోబెట్టుకుని, లాలించి, ఆడించి
ఒడినే ఒరగా, ఆయుధంగా తీర్చిదిద్ది
చదువు, జ్ఞానం, మానవ విలువలు, మానవ హక్కుల రుచిని చూపించిన
ఒక మధురాక్షరి అవతరించిన రోజు... ఈ రోజు!
బడి - బడి మద్యన స్థాపనలతో అడుగడుగునా హైందవ అగ్రహారాలని, పురుష దురహంకారాలని ఎదుర్కొని
భారతీయ సాంఘీక సంగ్రామిగా బుద్ధ భూమిలో పరిమళించి, ప్రళయం పుట్టించి విజేతగా
బ్రిటిష్ అంపైర్ మన్ననలను పొందిన ఒక అగ్రగామి
అణగారిన జాతుల చదువుల తల్లి సరస్వతి పుట్టిన రోజు.... ఈ రోజు!
కవితలు, ప్రసంగాలు అవిరళ, అనర్గళంగా మాట్లాడ గల, రాయగల
ఒక సాహితీ స్రవంతి నేరుగా హిందూ సముద్రాన్ని ఢీ కొట్టిన రోజు... ఈ రోజు !
విద్యార్థినీ విద్యార్థుల భుజాలపై పెద్ద విద్యావేత్తననే గర్వంతో స్వారీ చేయకుండా నిగర్విగా
చదువే శ్వాసగా, బతుకుగా, ధ్యేయంగా,
ఉత్తరోత్తరా ఉన్నత లక్ష్యంగా పిల్లల్ని అక్షరం ఇష్టులుగా మార్చి..
ప్రపంచం ఎదుట భరత ఖండం రూపురేఖలనే మార్చి వేసిన మదర్ ఆఫ్ ఇండియన్ ఎడ్యుకేషన్ సావిత్రి బాయి పూలే పుట్టిన రోజు.... ఈ రోజు!
తన అక్షర యాత్రలో పేద
బురద నీళ్ళను కూడా అక్షరం మొగ్గలకు
ఎరువుగా వాడిన సంయమన శీలి
కర్మభూమిని దున్ని సాగు చేసి పండిన చదువుల పంటని
కోట్లాది నిరక్షరాస్యులకు పంచిపెట్టి అక్షరం క్షుద్బాధని తీర్చిన అక్షర ధానకర్ణి ప్రభవించిన రోజు.. ఈ రోజు !
శూద్ర, అతి శూద్ర జాతికే కాకుండా కుల మతాలకు అతీతంగా
తను ఆర్జించిన అక్షర జ్ఞాన సంపదను జీవధారగా,
జీవనాడిగా చేయడానికి
తన జీవితం సర్వస్వాన్ని త్యాగించిన పుణ్యాక్షరి ఉదయించిన రోజు... ఈ రోజు!
విద్య లేక నిరక్షరాస్యత వల్ల జడులైన బాలబాలికలకు
వెన్నుతట్టి వారి జీవితాల్లో అక్షరం వెలుగులు విరజిమ్మిన తేజాక్షరి
ఇంద్రధనువులా ఈ నేలను వాలిన రోజు... ఈ రోజు!!
(చదువుల తల్లి సావిత్రీ బాయి పూలే జయంతి సంధర్భంగా)

-సర్వేశ్వర రావు. నీలం
6304664725

మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వ్యాన్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్

-కృష్ణా జిల్లా పరిధిలో ప్రజలకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

- ప్రతి మండలంలో మూడు రోజులపాటు సేవలు అందించనున్న మొబైల్ వ్యాన్

అమరావతి, జనవరి 2:కృష్ణా జిల్లాలో ప్రజలకు సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వ్యాన్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురువారం రాత్రి మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి తక్షణం చికిత్స అందించేందుకు ఈ వాహనం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పవన్ కళ్యాన్ అన్నారు.

ఈ వాహనం కృష్ణా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రజలకు సేవలంచనుంది. వారంలో మూడు రోజుల పాటు మండల పరిధిలోని గ్రామాల్లో పర్యటించి అల్ట్రాసౌండ్, మామోగ్రామ్, రక్త పరీక్షలు, ఎక్స్‌రే, కెమికల్ అనాలిసిస్, కోలనోస్కోపీ వంటి పరీక్షలు ఈ మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వ్యాన్ ద్వారా ఉచితంగా నిర్వహించనున్నారు.

మహిళల్లో క్యాన్సర్ లక్షణాలను గుర్తించేందుకు నివారణ చర్యల్లో భాగంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వ్యాన్ ద్వారా ఏడాదికి 40 వేల మరణాలను అరికట్టవచ్చని వైద్య నిపుణులు తెలిపారు.

కాగా, మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి చొరవతో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (భెల్) సంస్థ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ.2 కోట్ల నిధులతో ఈ వాహనాన్ని ఏర్పాటు చేసింది. సామాజిక బాధ్యతతో ప్రజల కోసం ఈ వాహనాన్ని ఏర్పాటు చేసిన భెల్ కంపెనీ ప్రతినిధులను, చొరవ చూపిన ఎంపీ వల్లభనేని బాలశౌరి ని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అభినందించారు.

న్యూ ఇయర్ వేళ.. గోవాలో ఏపీ యువకుడు దారుణ హత్య

హైదరాబాద్, జనవరి 2:న్యూ ఇయర్ వేడుకల వేళ గోవాలో దారుణం జరిగింది. కొత్త సంవత్సరం వేడుకలకు గోవా వెళ్లిన ఆంధ్రప్రదేశ్ యువకుడిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.

వివరాల్లోకి వెళ్తే.. న్యూ ఇయర్ వేడుకల కోసం తాడేపల్లిగూడెం నుంచి ఓ ఎనిమిది మంది యువకులు గోవా వెళ్లారు. డిసెంబర్ 29వ తేదీన అర్ధరాత్రి గోవాలోని ఓ రెస్టారెంట్‌లో 8 మంది దిగారు. 31న అర్ధరాత్రి ఫుడ్ ఆర్డర్ విషయంలో వీరికి.. రెస్టారెంట్ సిబ్బందికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఫుడ్ రేట్ల గురించి ప్రశ్నించిన యువకులపై రెస్టారెంట్ నిర్వాహకులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రవితేజ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా రవితేజ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై రవితేజ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

2026 తర్వాత కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం కొనసాగడం కష్టమే : సంజయ్ రౌత్

న్యూఢిల్లీ, జనవరి 2: కేంద్రంలోని ఎన్డీయే సర్కార్‌పై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2026 తర్వాత కేంద్రంలో మోదీ నేతృత్వం లోని ఎన్డీయే ప్రభుత్వం మనుగడ కొనసాగిండం కష్టమేనని వ్యాఖ్యానిం చారు. మోదీ తన పదవీకాలాన్ని కూడా పూర్తి చేసుకోలేకపోవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

గురువారం ఉదయం మీడియాతో సంజయ్ రౌత్ మాట్లాడుతూ.. '2026 తర్వాత కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మనుగడ సాగిస్తుందో..? లేదో..? అనే సందేహం నా మదిలో ఉంది. మోదీ తన పదవీకాలాన్ని పూర్తి చేయకపోవచ్చని నేను భావిస్తున్నాను. కేంద్ర ప్రభుత్వంలో అస్థిరత ఏర్పడితే.. మహారాష్ట్రలోనూ ఆ ప్రభావం కనిపిస్తుంది' అని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రభుత్వ విప్ హామీ

రాజన్న సిరిసిల్ల, జనవరి 2: (నేటినిజం ప్రతినిధి): : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను గురువారం ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గత 24 రోజులుగా సమ్మె చేయడం జరుగుతుందని, తమ న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆది శ్రీనివాస్ సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.